www.udyamakeratam.com
PRGI No. : TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 111 | 9-10-2026 | శుక్రవారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |

# మోదీ గద్దె దిగు

## లేకుంటే ప్రజలే దింపుతారు



- 13 కోట్ల ఓట్ల గల్లంతు ఎలా సాధ్యం?
- దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓట్ల తొలగింపు వెనుక కుట్ర
- ఈడీ, ఐటీ, సీబీఐ దాడులు బీజేపీ ప్రభుత్వాన్ని రక్షించలేవు
- ఓటు బచావో.. దేశ్ బచావో ప్రదర్శనలో సీఎం రేవంత్ రెడ్డి

2

"కేంద్రంలో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని దొడ్డిదారిన కుట్రలు చేస్తే ప్రజలే తిరుగుబాటు చేసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని గద్దె దించడం ఖాయమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈడీ, ఐటీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులతో బెదిరిస్తూ ఇకపై ఏమాత్రం బీజేపీ ప్రభుత్వాన్ని రక్షించుకోలేరని స్పష్టం చేశారు. 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పేరిట దేశవ్యాప్తంగా ఓట్లను గల్లంతు చేస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే భర్తరఫ్ చేయాలని, లేనిపక్షంలో ప్రధాని మోదీయే తన పదవికి రాజీనామా చేసి గద్దె దిగాలని డిమాండ్ చేశారు."

*- ఢిల్లీ, అక్టోబర్ 8 (ఉద్యమ కెటరం)*

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

మోదీ, షాకు సద్బుద్ధి కలగాలి ■ రాజ్‌ఘాట్ వద్ద ఇండీ నేతల ప్రార్థనలు



## జ్ఞానేష్ రాజీనామా చేసే దాకా

# పోరాటం

- ఎన్నికల ప్రక్రియపై ప్రజలు విశ్వాసం కోల్పోయారు
- 'చలో లోక్‌భవన్' ర్యాలీలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

వివరాలు 2వ పేజీలో

కేంద్ర ఎన్నికల సంఘం 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పేరుతో డ్రాఫ్ట్ రోల్స్ నుండి 13 కోట్లకు పైగా ఓట్లను గల్లంతు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోందని ఆరోపిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలు చేపట్టిన 'చలో లోక్‌భవన్' ర్యాలీ హైదరాబాద్ నగరంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. 'సేవ్ డెమోక్రసీ' నినాదంతో గురువారం నిర్వహించిన ఈ నిరసన ప్రదర్శనలో సీఈసీ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ఈ భారీ ర్యాలీలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడారు. దేశంలోని 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కోట్లాది మంది అర్హులైన పేద, మైనారిటీ ఓటర్ల పేర్లను తొలగించడం ఎన్నికల ఫలితాలను ఏకపక్షంగా ప్రభావితం చేసే కుట్రేనని మండిపడ్డారు.

*- హైదరాబాద్, అక్టోబర్ 8 (ఉద్యమ కెరటం) :*

## ఓటర్ల తొలగింపుపై 'ఇండియా' కూటమి గర్జన

- హైదరాబాద్‌లో 'చలో లోక్‌భవన్' ఉద్రిక్తం, టీపీసీసీ చీఫ్, మంత్రుల అరెస్ట్!



# రాజ్యాంగ సంస్థలు ఎవరి సొత్తు కాదు

- విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నాలు
- అనవసర గందరగోళం సృష్టించరాదు
- మాజీ న్యాయమూర్తుల ఘాటు వ్యాఖ్యలు!

4



దేశవ్యాప్తంగా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు మిన్నంటుతుండగా, సంఘ్‌పరివార్‌కు సన్నిహితంగా ఉండే 42 మంది సుప్రీంకోర్టు, హైకోర్టు మాజీ న్యాయమూర్తులు ఆయనను, ఎన్నికల కమిషన్‌ను సమర్థించారు. ఈ మేరకు గురువారం ఒక బహిరంగ లేఖ విడుదల చేశారు. కచ్చితమైన ఓటర్ల జాబితాలు, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు మద్దతు ఇవ్వడమే ఎన్నికల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ఉద్దేశమని పేర్కొన్నారు. "5 దశాబ్దాలకు పైగా ఈ దేశాన్ని పాలించిన ఒక పార్టీ, ఇప్పుడు తమను ఎన్నుకున్న వ్యవస్థలోనే అవకతవకలు జరిగాయని ఆరోపిస్తోంది. అది ఒంటరిగా ఈ పని చేయడం లేదు. ఎంపిక చేసిన కేసులతో సుదీర్ఘ చరిత్ర కలిగిన కార్యకర్తల సంఘాలు ఈ ఆరోపణలకు చట్టబద్ధత ముసుగు కల్పిస్తున్నాయి" అని పేర్కొన్నారు.

# క్షమాగుణం వల్లే నేరాల పెరుగుదల

- మరణశిక్షలను జీవిత ఖైదుగా మార్చడంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు
- క్షమించే ధోరణికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాల్సిందే
- పెరోల్‌పై వచ్చి భార్యను హత్య చేసిన ఖైదీ ఉదంతం ప్రస్తావన
- అరుదైన వాటిలో అత్యంత అరుదైన కేసులపై మారుతున్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి
- మహిళలపై నేరాల కట్టడికి కఠిన చర్యలు అవసరమన్న సుప్రీంకోర్టు

2



జఘన్య నేరాలకు పాల్పడిన నిందితులకు విధించిన మరణశిక్షలను యావజ్జీవ కారాగార శిక్షలుగా తగ్గించడం, న్యాయస్థానాలు ప్రదర్శించే అతి క్షమా గుణమే దేశంలో తీవ్రమైన నేరాలు పెరగడానికి దారితీస్తోందని, ఈ ధోర ణికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకా ల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు చేసిం ది. గతంలో 'అరుదైన వాటిలో అత్యంత అరుదైన' సిద్ధాంతం ప్రాతిపదికన శిక్షలు ఉండేవని, నాటి రోజుల్లో హత్యలు అరుదుగా జరగడమే దానికి కారణమని, కానీ నేటి రోజుల్లో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది.



# ఆన్ కార్సన్‌కు సాహిత్య నోబెల్!

- కెనడా రచయిత్రిని వరించిన నోబెల్
- సాహిత్య హద్దులను చెరిపేసిన రచయిత్రి

4



## 14న సింగరేణి కార్మిక గర్జన సభ

- ముఖ్య అతిథిగా కేటీఆర్
- సింగరేణి ఎన్నికలు నిర్వహించాలి
- బోనస్‌గా లాభాల్లో పూర్తి వాటా అందించాలి
- ఇచ్చిన హామీలు తీర్చాల్సిందే
- బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీష్‌రావు

3

## వ్యాపారులకు భారీ ఊరట

పన్ను అధికారులకు అరెస్ట్ అధికారం రద్దు

ప్రాసిక్యూషన్ పరిమితి రూ. 5 కోట్లకు పెంపు

జీఎస్టీ రేట్లలో ఊరట.. ఈసారి లేని మార్పులు

57వ జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు!

4



## ఈ-హెచ్ఆర్ఎంఎస్‌తో ఉద్యోగుల డేటా నమోదు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

3



## ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల్లో సవరణలకు అవకాశం

- తప్పులుంటే ఆన్‌లైన్‌లో వివరాల సవరణ
- తిరస్కరణలపై క్లెయిమ్‌లు, అభ్యంతరాల నమోదుకు అవకాశం

3




## భగీరథ్ కేసు వార్తలపై హైకోర్టు ఆంక్షలు!

- పోక్సో కేసు ప్రచారంపై మధ్యంతర ఉత్తర్వులు
- దర్యాప్తు పూర్తికాకముందే దోషిగా చిత్రీకరిస్తున్నారంటూ పిటిషన్

3





# విపక్ష నేతలపై కేంద్రం తీరు దారుణం

## ఎన్నికల సంఘం పూర్తి స్వతంత్రంగా వ్యవహరించాలి

## విలేకరుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి

**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 8 (ఉద్యమ కెరటం) :** దేశ ప్రజల తరఫున, వారి ఓటు హక్కు రక్షణ కోసం పోరాడుతున్న ప్రతిపక్ష నేతలపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తీవ్ర అభ్యంతరకరమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. దిల్లీలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని అడ్డం పెట్టుకుని ప్రజల ప్రాథమిక ఓటు హక్కును కాలరాస్తోందని విమర్శించారు. ఎన్నికల ముంగిట వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న అక్రమాలపై రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలు మొదటినుంచీ ప్రశ్నిస్తున్నారని, అప్పట్లో వాటిని రాజకీయ విమర్శలుగా కొట్టిపారేసినా ఇప్పుడు ఎన్నికల సంఘం కమిషన్‌లోని కమిషనర్లే అంగీకరించడంతో ఆ ఆరోపణలు నిజమని రుజువయ్యాయని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో దేశ ప్రజల్లో ఎన్నికల ప్రక్రియ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి ప్రధాన ఎన్నికల కమిషనర్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరుగుతున్నాయనే నమ్మకం సామాన్య ప్రజల్లో కూడా కలగాలంటే ఎన్నికల సంఘం పూర్తి స్వతంత్రంగా వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థను ఈ స్థాయికి దిగజార్చినందుకు బీజేపీ ప్రభుత్వం కూడా బాధ్యత వహించాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. నేడు దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం విశ్వసనీయతపైనే తీవ్ర చర్చ నడుస్తున్నందున ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడేందుకు బాధ్యులు తప్పుకోవాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు.

# క్షమాగుణం వల్లే నేరాల పెరుగుదల

## క్షమా గుణానికి ఎక్కడో ఒక చోట ఎండ్ కార్డ్ పడాలి

## సుప్రీం జడ్జి జస్టిస్ దీపాంకర్ దత్తా కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 8:** మరణశిక్షలను జీవిత ఖైదుగా మార్చే విషయంలో సుప్రీంకోర్టు క్షమా గుణం వల్లే దేశంలో నేరాలు పెరుగుతున్నాయని, దీనికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాలని దేశ అత్యున్నత న్యాయస్థానం జడ్జి జస్టిస్ దీపాంకర్ దత్తా వ్యాఖ్యానించారు. గతంలో హత్య కేసుల్లో శిక్షలు 'అరుదైన వాటిలో అత్యంత అరుదైన' సిద్ధాంతం ఆధారంగా ఉండేవని అన్నారు. ఎందుకంటే ఆ రోజుల్లో హత్యలు చాలా అరుదుగా జరిగేవని, కానీ ప్రస్తుత రోజుల్లో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మర్డర్ కేసులో మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చుకున్న ఒక ఖైదీని ముందస్తుగా విడుదల చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగులతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ వ్యాఖ్యలు చేశారు. 'సుప్రీంకోర్టు క్షమాగుణం వల్లే దేశంలో నేరాలు పెరుగుతున్నాయి. దీనికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాల్సిన అవసరం ఉంది. ఒక తండ్రి తన సొంత పెద్ద కుమార్తెపై అత్యాచారం చేసి, ఆమెను హత్య చేశాడు. ఆ కేసులో అతడి భార్య ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా నిందితుడికి జీవిత ఖైదు పడింది. కొన్నేళ్ల తర్వాత ఆ నిందితుడు పెరోల్‌పై బయటకు వచ్చి తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినందుకు పగతో భార్యను (చిన్న కూతురి కళ్ల ముందే) దారుణంగా హత్య చేశాడు. చిన్న కుమార్తె ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా అతడికి కోర్టు మరణశిక్ష విధించింది. అయితే, ఆ నిందితుడు చిన్న కూతురిని చంపలేదనే కారణంతో సుప్రీంకోర్టు అతడి మరణశిక్షను కాస్త మళ్లీ జీవిత ఖైదుగా తగ్గించింది. అందుకే సుప్రీంకోర్టు క్షమించే గుణానికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాల్సిందే' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా పేర్కొన్నారు. మరోవైపు, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఇటీవల కాలంలో జరిగిన అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారిస్తున్న సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశ రాజధాని దిల్లీలో నేరాలను గుర్తించడం, నివారించే అవసరాన్ని వివరించింది. ముఖ్యంగా విద్యాసంస్థల పరిసరాల్లో బీట్ పెట్రోలింగ్‌ను పెంచాలని దిల్లీ పోలీసులు, రవాణా శాఖ, స్థానిక పరిపాలన యంత్రాంగానికి ఆదేశించింది. అలాగే ప్రజా రవాణా వాహనాల డ్రైవర్లు, సహాయకులను కఠినంగా తనిఖీ చేయాలని సూచించింది. అవసరమైన అనుమతులు లేకుండా పనిచేస్తున్న అనధికార మద్యం దుకాణాలు, సంస్థలను గుర్తించి చట్ట ప్రకారం వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణను నవంబర్ 16కు వాయిదా వేసింది. కాగా, ఈ కేసు విచారణ సందర్భంగా మహిళలపై నేరాలకు సంబంధించి ఇటీవలే దేశ అత్యున్నత న్యాయస్థానం ఘాటు వ్యాఖ్యలు చేసింది. నేరాలకు పాల్పడే గూండాల మనసుల్లో భయం సృష్టించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ముఖ్యంగా దిల్లీలోని కొన్ని సున్నితమైన ప్రాంతాల్లో మహిళలకు భద్రత లేదనే భావన ఉందని పేర్కొంది. దిల్లీలో అసాంఘిక శక్తులు లైంగిక నేరాలకు పాల్పడకుండా నిరోధించడానికి కఠినమైన చర్యలు, మరింత పటిష్టమైన పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని దిల్లీ పోలీసులను కోరింది. మహిళలు, బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడే సామాజిక వ్యతిరేక శక్తులను నిరోధించడానికి దిల్లీలో మరింత కఠినమైన, పటిష్టమైన పోలీస్ వ్యూహం అవసరమని స్పష్టం చేసింది. దేశ రాజధాని నగరమైన దిల్లీలో నేరాలను అరికట్టడం అత్యవసరమని చెప్పింది. క్షేత్రస్థాయిలో పోలీసు వ్యవస్థను బలోపేతం చేయాలని, నేరాలకు పాల్పడటానికి ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భావన నేరస్థుల్లో కలిగించాలని సూచించింది.

# మోదీ గద్దె దిగు.. లేకుంటే ప్రజలే దింపుతారు



- 13 కోట్ల ఓట్ల గల్లంతు ఎలా సాధ్యం?
- దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓట్ల తొలగింపు వెనుక కుట్ర
- ఈడీ, ఐటీ, సీబీఐ దాడులు బీజేపీ ప్రభుత్వాన్ని రక్షించలేవు
- ఓటు బచావో.. దేశ్ బచావో ప్రదర్శనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ఢిల్లీ, అక్టోబర్ 8 (ఉద్యమ కెటరం) :** ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని దొడ్డిదారిన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తే ప్రజలు తిరుగుబాటు చేస్తారని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈడీ, ఆదాయపు పన్ను శాఖ, సీబీఐ దాడులు ఇకపై బీజేపీ ప్రభుత్వాన్ని ఏమాత్రం రక్షించలేవన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన గద్దెను ఖాళీ చేయాలని, లేకపోతే ప్రజలే ఆయనను గద్దె దించుతారని రేవంత్‌రెడ్డి అన్నారు. ఓటు బచావో.. దేశ్ బచావో ఉద్యమంలో భాగంగా విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ సీనియర్ నేతలు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, ఇండి కూటమి నేతలు మహాత్మా గాంధీ సమాధి రాజ్‌ఘాట్ వరకు గురువారం ప్రదర్శన నిర్వహించారు. రాజ్‌ఘాట్ వద్ద నివాళుల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఈ ఉద్యమం కాంగ్రెస్ పార్టీ పోరాటం కోసమో, ఇండి కూటమి కోసమో కాదని, దేశంలోని సామాన్యుల హక్కుల పరిరక్షణ ఉద్యమమని అన్నారు. 2014 ఎన్నికల నాటికి దేశంలో 81 కోట్ల మంది ఓటర్లు ఉంటే 2019 నాటికి ఆ సంఖ్య 91 కోట్లకు చేరిందని సీఎం గుర్తు చేశారు. 2024 నాటికి 97 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. దేశ జనాభా 140 కోట్లకు చేరుకుందని, ఓటర్ల సంఖ్య మరింతగా పెరగాల్సింది పోయి ఏకంగా 13 కోట్ల ఓట్ల గల్లంతు అయ్యాయని, అవి ఎలా తగ్గిపోయాయో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, భగత్ సింగ్ వంటి వారు ప్రాణాలకు తెగించి పోరాడి స్వాతంత్ర్యం తెచ్చారని సీఎం అన్నారు. సంపన్నులు, పేదలు తేడా లేకుండా డాక్టర్ అంబేద్కర్ ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించారన్నారు. ఇప్పటివరకు 'సర' ఎన్నిసార్లు జరిగినా పేదల ఓట్లకు ముప్పు కలగలేదన్నారు. ఇప్పుడు మాత్రం రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అణగారిన వర్గాల నుంచి గుంజుకునేందుకు ప్రధానమంత్రి మోదీ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ప్రయత్నిస్తున్నారని సీఎం ఆరోపించారు. ఎన్నికల సంఘం తప్పులను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలపై పోలీసులతో దాడులు చేయించడం, ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన నేతలను ఎన్నికల సంఘం కలవకపోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని సీఎం మండిపడ్డారు. కులం, మతం, ప్రాంతం, భాషల పేరుతో దేశ ప్రజలను విభజించి బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. దేశ ప్రజలను ఓటు ఉన్నవాళ్లు, ఓటు లేనివాళ్లుగా, రెండు వర్గాలుగా విభజిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీకి అనుకూలంగా ఉన్న వాళ్లు ఒకవైపు, వ్యతిరేకంగా ఉన్న పేదలు మరో వైపు అన్నట్లుగా మోదీ, జ్ఞానేష్ కుమార్ పరిస్థితులను మార్చారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా తీర్పునిచ్చే దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనారిటీ ఓట్లను లక్ష్యంగా చేసుకుని వారి ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు.

# సీఈసీ రాజీనామా చేయాల్సిందే

- మోదీ, షాకు సద్బుద్ధి కలగాలి
- రాజ్‌ఘాట్ వద్ద ఇండీ నేతల ప్రార్థనలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 08(ఆర్ఎన్ఏ): స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతిపిత మహాత్మా గాంధీ ఆశీస్సులతో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ ఎంపీలు స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ ఆందోళన ఆగదని తేల్చి చెప్పారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో కలిసి దాదాపు 300 మంది ఉభయ సభల ఎంపీలు బస్సులో రాజ్ ఘాట్?కు వెళ్లారు. జాతిపిత మహాత్మా గాంధీ స్మారకం వద్ద ఒక్కొక్కరుగా నివాళులర్పించారు. దిల్లీలో శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళన చేయనున్నట్టు తెలిపారు. అంతకుముందు మాట్లాడిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఓట్ల దొంగతనం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, యువత సమస్యలన్నీ ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని చెప్పారు. జవహర్ లాల్ నెహ్రూ, మహాత్మా గాంధీ, వల్లభ్ భాయ్ పటేల్ వంటి మహానాయకులు సాధించి పెట్టిన స్వేచ్ఛను, ఓటు హక్కును బీజేపీ ప్రభుత్వం లాక్కుంటోందని ఆరోపించారు. లోక్?సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తమను రెండు రోజులుగా నిరసన తెలపకుండా అడ్డుకున్నారని, మొదటి రోజు ఎన్నికల సంఘం వద్ద, బుధవారం జంతర్ మంతర్ వద్ద అడ్డుకుని దాడులు చేశారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రహోంమంత్రి అమిత్ షా, జ్ఞానేష్ కుమార్, మోహన్ భగవత్ లు నేరపూరిత కుట్ర ద్వారా రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఓట్లను దొంగిలించి దేశాన్ని హైజాక్ చేశారని, త్వరలోనే ఆ నలుగురిని చట్టం ముందుకు తెస్తామన్నారు. ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలవనున్నారు. అందుకోసం అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. ఆ సమయంలో ఎన్నికల సంఘంపై వస్తోన్న ఆరోపణలకు సంబంధించి వినతి పత్రం సమర్పించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు బంగాల్ మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఇప్పటికే దిల్లీకి చేరుకున్నారు. ఇదిలా ఉండగా, సీఈసీకి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిన ఇండీ కూటమి ఎంపీలు పట్ల దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై మధ్యప్రదేశ్ కాంగ్రెస్ గురువారం భోపాల్‌లో ఆందోళన నిర్వహించింది. వ్యాపమ్ స్క్వేర్ నుంచి బోర్డ్ ఆఫీస్ స్క్వేర్ వరకు కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. "ఓటును కాపాడండి, దేశాన్ని కాపాడండి" అనే నినాదంతో భోపాల్ నగర జిల్లా కాంగ్రెస్ కమిటీ నిర్వహించిన ఈ నిరసనలో సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ సహా పలువురు పాల్గొన్నారు. ఓటు హక్కును కాపాడుకునేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో తమ చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతామని తెలిపారు.

# జ్ఞానేష్ రాజీనామా చేసే వరకు పోరాటం

## ఎన్నికల ప్రక్రియపై ప్రజలు విశ్వాసం కోల్పోయారు

## 'చలో లోక్‌భవన్' ర్యాలీలో మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, అక్టోబర్ 8 (ఉద్యమ కెరటం) :** కేంద్ర ఎన్నికల సంఘం 'సర్' పేరుతో ఓటర్ల జాబితాలో భారీ మార్పులు చేసి నిజమైన ఓటర్లను తొలగించేలా వ్యవహరిస్తోందని, తద్వారా ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోందని రెవెన్యూ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. అందువల్లే సీఈవో జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేసేవరకు తమ పోరాటం ఆగదన్నారు. ఓట్ల సవరణ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డారంటూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండి' కూటమి ఇచ్చిన సేవ్ డెమోక్రసీ పిలుపులో భాగంగా టీపీసీసీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం చలో లోక్ భవన్ ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో పాల్గొన్న మంత్రి పొంగులేటి మాట్లాడుతూ దేశంలోని 30 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో 13 కోట్లకు పైగా పేర్లు డ్రాఫ్ట్ రోల్స్ నుంచి తొలగించడం సరికాదన్నారు. ఓటర్లను తొలగించడం ద్వారా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. 'సర్' ప్రక్రియలో ప్రతిపక్ష పార్టీలను సంప్రదించడం లేదన్నారు. స్థానిక ఓటర్ల నమోదు అధికారుల అధికారాలను బలహీనపరిచేలా ఈసీనెట్ వ్యవస్థను వినియోగించారని, ఎన్నికల కమిషన్ నిష్పాక్షికంగా వ్యవహరించకుండా అధికార పక్షానికి కొమ్ముకాసేలా నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించినందున సీఈవో జ్ఞానేశ్ కుమార్ తక్షణం రాజీనామా చేయాలని, అంతవరకు తమ పోరాటం ఆగదని మంత్రి పొంగులేటి మరోసారి స్పష్టం చేశారు.



### మహేశ్ గౌడ్, మంత్రుల అరెస్ట్..

లోక్‌భవన్ వద్ద ఆందోళనకు దిగిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులను పోలీసులు అరెస్టు చేశారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం చలో లోక్‌భవన్‌కు కాంగ్రెస్, టీజేఏస్, లెఫ్ట్ పార్టీలు పిలుపునిచ్చాయి. కాంగ్రెస్, సీపీఐ శ్రేణులు భారీ ఎత్తున తరలి వచ్చాయి. పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు, 'ఇండి' కూటమి రాష్ట్ర నేతలు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఖైరతాబాద్ నుంచి లోక్‌భవన్ వైపు ర్యాలీగా బయలుదేరిన నేతలను అడ్డుకున్నారు. లోక్‌భవన్‌కు 300 మీటర్ల దూరంలో బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ఆందోళనకారులను అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. ర్యాలీని అడ్డుకున్న పోలీసులపై మంత్రులు, ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేశ్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరోవైపు దేశవ్యాప్తంగా 'ఇండి' కూటమి ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి.

# 14న సింగరేణి కార్మిక గర్జన సభ

- ముఖ్య అతిథిగా బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సింగరేణి ఎన్నికలు నిర్వహించాలి
- బోనస్ గా లాభాల్లో పూర్తి వాటా అందించాలి
- ఇచ్చిన హామీలు తీర్చాల్సిందే
- బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత హరీష్‌రావు డిమాండ్




**హైదరాబాద్, అక్టోబర్ 8:** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సింగరేణి కార్మిక గర్జన పేరుతో ఈనెల 14న రామగుండంలోనిర్వహించే భారీ బహిరంగ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, ఈ సభను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ఎల్పీ డిప్యూట్ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో టీబీజీకేఎస్, సింగరేణి ప్రాంత ప్రజాప్రతినిధులతో గురువారం జరిగిన సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సింగరేణి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నదని విమర్శించారు. కార్మికులే కాదు, అధికారులూ ధర్నాలు చేస్తున్న పరిస్థితి నెలకొన్నదన్నరు. లాభాల్లో పూర్తి వాటా అందించాలని, డిపెండెంట్ ఉద్యోగాలను మెడికల్ బోర్డు నిర్వహించి అర్హులకు ఇవ్వాలని, వెంటనే సింగరేణి ఎన్నికలు నిర్వహించాలని, సింగరేణి బకాయిలు త్వరగా చెల్లించాలనేవి ప్రధాన డిమాండ్లని చెప్పారు. వీటితోపాటు ఎన్నికల మేనిఫెస్టోలో అనేక హామీలు ఇచ్చి మోసం చేశారని, వాటన్నింటిని అమలు చేయాలనే డిమాండ్ తో సభ నిర్వహిస్తున్నామన్నారు. దసరా ముందు లాభాలు డిక్లేర్ చేయడం, లాభాల్లో వాటా ఇవ్వడం ఆనవాయితీ. కానీ పండగ వస్తున్నా లాభాలు డిక్లేర్ చేయలేదు, వాటాల గురించి చెప్పడం లేదు. రెండున్నరేండ్లుగా కాంగ్రెస్ సింగరేణి కార్మికులను మోసం చేసింది.. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు 32శాతం లాభాల వాటా ఇస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలో కేవలం 16శాతమే ఇచ్చిందని ఆయన చెప్పారు. మాటల్లో 33శాతం చెప్పి ఇచ్చింది 16శాతం వాటా మాత్రమేనన్నారు. వచ్చిన లాభాల్లో భవిష్యత్ అవసరాల పేరిట పక్కన బెట్టి వాటా పంచారన్నారు.

### ఉత్పత్తి ఎందుకు తగ్గిందో?

2024-25లో ఇచ్చింది 12.5శాతం మాత్రమే. అంటే కార్మికులకు తీరని అన్యాయం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. అవినీతి, బంధుప్రీతి, పరిపాలన వైఫల్యం వల్ల సింగరేణి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. 2022-23లో రూ.2022 కోట్లు, 2023-24లో రూ.4712 కోట్లు, 2024-25 రూ.6,394 కోట్లు లాభాలు వస్తే ఈ సంవత్సరం డిక్లేర్ చేయలేదని హరీష్‌రావు విమర్శించారు. అందుతున్న సమాచారం ప్రకారం రూ.1800 కోట్లు కూడా మించదన్నారు. ఇంత దారుణంగా మూడు వంతుల లాభాలు తగ్గడం అంటే సింగరేణి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. దీనికి కారణం పరిపాలనా వైఫల్యం కాదా అని అడిగారు. రేవంత్ తుగ్లక్ నిర్ణయాల వల్ల లాభాలు పడిపోతున్న పరిస్థితి ఉందని, కార్మికులు మాత్రం అద్భుతంగా పని చేస్తున్నారని చెప్పారు. ఔట్ పుట్ ఫర్ మ్యాన్ షిఫ్ట్ చూస్తే గతంలో 6.39 టన్నులు ఉంటే ఈ ఏడాదికి 7.56కు పెరిగిందని, కార్మికులు కష్టం చేశారు కానీ అడ్డగోలు నిర్ణయాలు సింగరేణిని నష్టాల బాట పట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సైట్ విజిట్ సర్టిఫికేట్ పెట్టడం, నెలలతరబడి టెండర్లు వాయిదా వేయడం, అధిక ధరలకు టెండర్లు కట్టబెట్టడం, రేవంత్ బామ్మర్దికి టెండర్లు ఇవ్వడం వల్ల ఇదంతా జరిగిందని ఆరోపించారు. 2023-24లో 70 మిలియన్ టన్నుల నుంచి 2025-26కు 58 మిలియన్ టన్నులకు బొగ్గు ఉత్పత్తి తగ్గిందని, నిజాయతీగా పని చేసే అధికారులను, మంచి డైరెక్టర్లను తొలగించి సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చారని ఆరోపించారు.

### మీ నిర్వాకం వల్లే ఈ పరిస్థితి

సకాలంలో మైన్స్ ఓపెన్ చేయక, కాంట్రాక్టర్లకు పేమెంట్స్ ఇవ్వక నష్టాలకు వెళ్తున్నది.. మీ నిర్వాకం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని హరీష్‌రావువిమర్శించారు. రాష్ట్రంలో బొగ్గు లేక థర్మల్ ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి ఆపేశారని, బొగ్గు లేక కరెంట్ ఉత్పత్తి చేయక రైతులు రోడ్ల మీదకు వచ్చి ధర్నాలు చేస్తున్నారన్నారు. సింగరేణికి చెల్లింపులు రూ.50వేల కోట్లు దాకా ఆగిపోయాయని, ప్రభుత్వం నుంచి, జెన్కో నుంచి చెల్లింపులే లేవని అన్నారు. వాటా పంచకుండా రూ.6323 కోట్ల లాభాలను బ్యాంకుల్లో దాచి పెట్టారు.. మరి రూ.4వేల కోట్ల ఓడీ ఎందుకు తెస్తున్నారని ప్రశ్నించారు. జీతాలు ఇవ్వాలంటే ఎందుకు అప్పులు తేవాల్సిన పరిస్థితి వచ్చిందని నిలదీశారు. పదేండ్ల బిఆర్ఎస్ హయాంలో ప్రతి సంవత్సరంలో లాభాలు పెరిగాయి.. కరోనా వచ్చినా లాభాలు తగ్గలేదు.. కాంగ్రెస్ రాగానే ఉత్పత్తి, కార్మికుల వాటా ఎందుకు తగ్గింది, లాభాలు ఎందుకు తగ్గుతున్నాయి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### 2019లో కేసీఆర్ జీవో ఇచ్చారు

జీవో 76 మేం తెచ్చినం అని అసెంబ్లీలో గొప్పలు చెప్పుకున్నరు.. ఇంటి హక్కులు కార్మికులకు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో కేసీఆర్ 2019లో జీవో ఇచ్చారన్నారు. కానీ పొంగులేటి వైఎస్ హయాంలో జీవో ఇచ్చినం అని చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సింగరేణి ప్రాంతంలో 30వేల మందికి ఇండ్లకు రిజిస్ట్రేషన్ చేసి అప్పగించారు.. కాంగ్రెస్ రాగానే జీవోను పక్కనబెట్టి నిషేధిత జాబితాలో పెట్టారని ఆరోపించారు. ఒక్క మంచిర్యాలలోనే వేల జాగలు నిషేధిత జాబితాలో పెట్టారన్నారు. మూడేళ్ల ఏం చేయకుండా బిగ్ రిలీఫ్, కార్మికులకు శుభవార్త అంటున్నరు.. మూడేళ్లు కార్మికుల ఉసురు పోసుకున్నందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే జీవో 76 కింద మిగిలిన కార్మికులకు సేల్ డీడ్ ద్వారా హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బిఆర్ఎస్ హయాంలో వలే కార్మికులకు ప్రతి నెలా మూడు మెడికల్ బోర్డులు పెట్టి డిపెండెంట్ ఉద్యాగాలు ఇవ్వాలని హరీష్‌రావు కోరారు. కేసీఆర్ 16వేల డిపెండెంట్ ఉద్యోగాలు . 4వేల మందికి పరీక్ష నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చారు. మొత్తంగా 20వేల మందికి ఉద్యోగాలు ఇచ్చారని గుర్తు చేశారు. డిపెండెంట్ ఉద్యోగాల మీద కాంగ్రెస్ ప్రభుత్వం అప్రకటిత నిషేధాన్ని పెట్టిందన్నారు .సింగరేణిని ప్రైవేటీకరణ చేసే కుట్రలు, చర్యలను మానుకోవాలని, బిఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. సింగరేణి కార్మికుల సమస్యల పట్ల బిఆర్ఎస్ ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం అవుతున్నది. కేంద్రం కూడా సింగరేణికి మైన్స్ కేటాయించాలని, సంస్థను కాపాడుకునేందుకు కేంద్ర బొగ్గు మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి చొరవ చూపాలని కోరుతున్నామన్నారు. కార్మికులు, సింగరేణి ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి రామగుండం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# భగీరథ్ కేసు వార్తలపై హైకోర్టు ఆంక్షలు!




- పోక్సో కేసు ప్రచారంపై మధ్యంతర ఉత్తర్వులు
- దర్యాప్తు పూర్తికాకముందే దోషిగా చిత్రీకరిస్తున్నారంటూ పిటిషన్
- టీవీ ఛానళ్లు, డిజిటల్, సామాజిక మాధ్యమాల ప్రచారంపై న్యాయస్థానం ఆదేశాలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు.. కౌంటర్లు దాఖలు చేయాలని సూచన

**హైదరాబాద్, అక్టోబర్ 8 (ఉద్యమ కెరటం):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు సంబంధించిన పోక్సో కేసుపై వార్తలు, కథనాలు, వీడియోల ప్రచారాన్ని నియంత్రిస్తూ తెలంగాణ హైకోర్టు కీలక మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో తనను దోషిగా చిత్రీకరించేలా మీడియాలో ప్రచారం జరుగుతోందంటూ భగీరథ్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను న్యాయస్థానం విచారించింది. ఈ సందర్భంగా కేసుకు సంబంధించిన కొత్త కథనాలు, వీడియోలు, ఇతర సమాచారాన్ని ప్రచురించడం, ప్రసారం చేయడం, తిరిగి సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చేయడంపై ఆంక్షలు విధించింది. జస్టిస్ ఈవీ వేణుగోపాల్ ఈ మేరకు మధ్యంతర ఆదేశాలు జారీ చేశారు. కేసుకు సంబంధించిన వాస్తవ వివరాలతో కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. తనపై నమోదైన కేసులో దర్యాప్తు పూర్తికాకముందే కొన్ని టీవీ ఛానళ్లు, డిజిటల్ మీడియా సంస్థలు, సామాజిక మాధ్యమాల వేదికలు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని భగీరథ్ పిటిషన్‌లో ఆరోపించారు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా భారతీయ న్యాయ సంహిత, పోక్సో చట్టాల కింద కేసు నమోదైందని, దర్యాప్తు క్రమంలో కొన్ని సెక్షన్లలో మార్పులు చోటుచేసుకున్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. జూన్ 19న మధ్యంతర బెయిల్, జులై 9న సాధారణ బెయిల్ లభించిన విషయాన్ని ప్రస్తావించారు. అయినప్పటికీ కొన్ని మీడియా వేదికల్లో తనను ఇప్పటికే నేరం రుజువైన వ్యక్తిగా చిత్రీకరిస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. కృత్రిమ మేధ సాంకేతికతను ఉపయోగించి తన చిత్రాలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారని భగీరథ్ పిటిషన్‌లో పేర్కొన్నారు. తనను రావణాసురుడి రూపంలో చిత్రీకరించడంతోపాటు అవమానకరమైన వ్యాఖ్యలతో పోస్టులు పెడుతున్నారని ఆరోపించారు. ఈ ప్రచారం తన వ్యక్తిగత ప్రతిష్ఠతోపాటు తన తండ్రి బండి సంజయ్ ప్రతిష్ఠను కూడా దెబ్బతీసేలా ఉందని పేర్కొన్నారు. న్యాయస్థానం తుది నిర్ణయం వెలువడకముందే మీడియా విచారణ నిర్వహించడం తన హక్కులకు భంగం కలిగిస్తోందని వాదించారు. మీడియా ప్రచారాన్ని నిలువరించాలని కోరుతూ గూగుల్, మెటా, ఎక్స్, యూట్యూబ్‌తోపాటు పలు టీవీ ఛానళ్లు, డిజిటల్ మీడియా సంస్థలను భగీరథ్ తన పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ, తెలంగాణ డీజీపీని కూడా ప్రతివాదులుగా పేర్కొన్నారు. కేసుకు సంబంధించిన ఊహాగానాలు, దర్యాప్తు సమాచారంగా పేర్కొంటూ ప్రచారం చేసే వివరాలు, మార్ఫింగ్ చిత్రాలు, కృత్రిమ మేధతో రూపొందించిన వీడియోలపై నియంత్రణ విధించాలని కోరారు. ఈ అభ్యర్థనలను పరిశీలించిన హైకోర్టు మీడియా సంస్థలు, సామాజిక మాధ్యమాల వేదికలకు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. పిటిషన్‌లో పేర్కొన్న అంశాలపై తమ వైఖరిని వెల్లడించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. కేసు వివరాలతో కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని సూచించింది. దర్యాప్తు కొనసాగుతున్న కేసుల్లో నిందితుడిని ముందుగానే దోషిగా చిత్రీకరించే ప్రచారం, వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించే కథనాలపై పిటిషనర్ లేవనెత్తిన అభ్యంతరాలను విచారణలో పరిగణనలోకి తీసుకుంది. మధ్యంతర ఆదేశాల అనంతరం తదుపరి విచారణను వాయిదా వేసింది. న్యాయస్థానం జారీ చేసినవి మధ్యంతర ఆదేశాలు మాత్రమే. ఇవి కేసులో నమోదైన ఆరోపణల నిజానిజాలపై తుది నిర్ణయం కావు. ప్రచారంపై విధించిన ఆంక్షల కచ్చితమైన పరిధి, వర్తించే సంస్థలు, ఇతర షరతులు రాతపూర్వక ఉత్తర్వుల ప్రకారం నిర్ణయించాల్సి ఉంటుంది.

# ఆరోగ్య భారత్‌కు పోషకాహారమే పునాది : సర్పంచ్ బాబురావు



**ఉద్యమ కెరటం, రెబ్బెన:** పోషకాహారం తీసుకోవడం ద్వారానే మనం ఆరోగ్యంగా, చురుకుగా ఉంటామని, ఆరోగ్య భారత్‌కు పోషకాహారమే పునాది అని గోలేటి సర్పంచ్ ఏ. బాబురావు పేర్కొన్నారు. గురువారం తక్కళ్లపల్లి, గోలేటి గ్రామపంచాయతీల పరిధిలో నిర్వహించిన 'పోషకాహార మాసోత్సవం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంక్ ఫుడ్స్, అధిక చక్కెర, ఉప్పు ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడం తగ్గించాలని సూచించారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే మంచి ఆహారపు అలవాట్లను నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు సమతులాహారం అందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ రేణుక, ఎసిడిపిఓ ప్రియదర్శిని, వైద్యాధికారి డాక్టర్ రిషిక, సూపర్‌వైజర్లు శిరీష, కళావతిలతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల్లో సవరణలకు అవకాశం

- తప్పులుంటే ఆన్‌లైన్‌లో వివరాల సవరణ
- తిరస్కరణలపై క్లెయిమ్‌లు, అభ్యంతరాల నమోదుకు అవకాశం
- నియోజకవర్గం, కేటగిరీ వివరాల మార్పునకు వెసులుబాటు
- ఆధార పత్రాలతో క్లెయిమ్‌లు సమర్పించాలని హౌసింగ్ బోర్డు సూచన

**హైదరాబాద్, అక్టోబర్ 8 (ఉద్యమ కెరటం):** తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలోని ఇందిరమ్మ ఇళ్లు అందుబాటు గృహ పథకం దరఖాస్తుదారులకు అధికారులు కీలక అవకాశం కల్పించారు. దరఖాస్తుల్లో నమోదైన వివరాల్లో తప్పులను సరిచేసుకోవడంతో పాటు, తిరస్కరణకు గురైన దరఖాస్తులపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ గౌతమ్ ఈ విషయాన్ని వెల్లడించారు. దరఖాస్తుదారులు తెలంగాణ హౌసింగ్ బోర్డు క్యూర్ పోర్టల్‌లో తమ దరఖాస్తు వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేసుకోవచ్చని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గం తప్పుగా నమోదై ఉంటే సరైన నియోజకవర్గాన్ని పేర్కొంటూ చెల్లుబాటు అయ్యే నివాస ధ్రువీకరణ పత్రాలను సమర్పించవచ్చు. 'ఔట్ ఆఫ్ కన్స్టిట్యూన్సీ' కారణంగా దరఖాస్తు తిరస్కరణకు గురైన వారు కూడా ఆధారాలతో క్లెయిమ్ చేసుకోవచ్చు. అర్హతకు సంబంధించిన అంశాలు లేదా ఇతర కారణాలతో దరఖాస్తులు తిరస్కరణకు గురైన వారు తమ అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. విద్యుత్ బిల్లులు, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ రికార్డులు, ఐజీఆర్ఎస్ వివరాలు తదితర ఆధారాలను క్లెయిమ్‌కు జతచేసే అవకాశం ఉంది. కేటగిరీ వివరాల్లో తప్పులున్నా సరిచేసుకునే వెసులుబాటు కల్పించారు. సంబంధిత కేటగిరీకి సంబంధించిన చెల్లుబాటు అయ్యే ధ్రువపత్రాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సరైన సమాచారం, చెల్లుబాటు అయ్యే ఆధార పత్రాలతోనే క్లెయిమ్‌లు సమర్పించాలని హౌసింగ్ బోర్డు సూచించింది. అందిన క్లెయిమ్‌లను పథక మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం అధికారులు పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు. సాంకేతిక సహాయం కోసం 040-24603572 నంబర్‌లో హౌసింగ్ బోర్డు కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

# ఈ-హెచ్ఆర్ఎంఎస్‌తో ఉద్యోగుల డేటా నమోదు

## 15 నాటికి ప్రక్రియ పూర్తి చేయాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**హైదరాబాద్, అక్టోబర్ 8 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలో మరింత పారదర్శక పరిపాలన అందించేందుకు ప్రభుత్వోద్యోగులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఈ-హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈ-హెచ్ఆర్ఎంఎస్)లో పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ఈ- హెచ్ఆర్ఎంఎస్ అమలు, ప్రభుత్వ శాఖల్లో డిజిటల్ విధానాలపై అన్ని శాఖల ఉన్నతాధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగుల నియామకం, సర్వీస్ రికార్డులు, జీతభత్యాలు, పదోన్నతులు, ఏసీఆర్‌లు, ఇతర ఉద్యోగ సేవలకు సంబంధించిన సమాచారాన్ని ఒకే డిజిటల్ వేదికపై అందుబాటులోకి తేవాలని సూచించారు. సుమారు 3.48 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన డేటాను ఈ- హెచ్ఆర్ఎంఎస్ లో నమోదు చేస్తున్నట్లు అధికారులు సీఎస్‌కు వివరించారు. మొత్తం 38,710 కార్యాలయాలకు సంబంధించిన డేటాలో ఇప్పటికే సుమారు 93 శాతం పూర్తి చేసినట్లు తెలపగా మిగిలిన ప్రక్రియను 15 నాటికి పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు.

### భవిష్యత్తులో డిజిటల్ అనుమతులకే ప్రాధాన్యం

పరిపాలనలో పారదర్శకత, వేగం, సామర్థ్యాన్ని పెంచేందుకు భవిష్యత్తులో అన్ని రకాల ప్రభుత్వ అనుమతులు, ఉత్తర్వులను సాధ్యమైనంత వరకు డిజిటల్ విధానంలోనే జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. ఆర్థిక శాఖకు సంబంధించిన ఈ-శాంక్షన్ ఉత్తర్వులను పూర్తిగా డిజిటల్ విధానంలోకి తేవాలని ఆదేశించారు. అన్ని ఆర్థిక సేవలు, మంజూరులు, చెల్లింపులకు సంబంధించిన ప్రక్రియలను ఆన్‌లైన్‌లో నిర్వహించేలా వ్యవస్థలను సమన్వయం చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించిన సాంకేతిక అనుమతుల ప్రక్రియను కూడా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని సీఎస్ తెలిపారు. అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) నుంచి చీఫ్ ఇంజనీర్ (సీఈ) వరకు సాంకేతిక అనుమతుల ప్రక్రియను డిజిటల్ విధానంలో చేపట్టాలని సూచించారు. అలాగే లబ్ధిదారులకు నేరుగా అందించే డైరెక్టు బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) మంజూరులను ఆధార్ ఆధారిత ధ్రువీకరణతో పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ- హెచ్ఆర్ఎంఎస్ తోపాటు అన్ని డిజిటల్ విధానాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రతి శాఖలో నోడల్ అధికారిని నియమించాలని సీఎస్ సూచించారు. అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేలా శాఖల వారీగా సమన్వయం ఉండాలని తెలిపారు. ప్రభుత్వ సేవలను వేగవంతం చేయడంతోపాటు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మరింత ఊతమిచ్చేలా డిజిటల్ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ సీఎస్‌లు బి.ఎం.డి.ఎక్కా, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానియా, అహ్మద్ నదీం, క్రిస్టినా చోంగ్తు, శిఖా గోయల్, కార్యదర్శులు గౌరవ్ ఉప్పల్, లోకేష్ కుమార్, దివ్య దేవరాజన్, సురేంద్ర మోహన్, హరిచందన, ఇ.శ్రీధర్, సిక్తా పట్నాయక్, విజయేంద్ర, సమాచార, పౌరసంబంధాల స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం



# నోబెల్ బహుమతిపై ట్రంప్ ఆశలు

### కమిటీపై అమెరికా అధ్యక్షుడి ఒత్తిళ్లు!

### ఎనిమిది యుద్ధాలు ఆపానంటూ ప్రకటన

### శాంతి బహుమతికి తనకంటే అర్హులెవరంటూ ప్రశ్నలు

### పురస్కారం ఇవ్వకపోతే కమిటీకే అవమానమని వ్యాఖ్యలు

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ శాంతి బహుమతిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి గంపెడాశలు పెట్టుకున్నారు. ప్రపంచ శాంతి కోసం తాను చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం తనకే దక్కాలని బహిరంగంగా కోరుతున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఎనిమిది యుద్ధాలను ఆపానని ప్రకటిస్తున్న ట్రంప్, తనకంటే ఈ బహుమతికి అర్హులెవరుంటారని ప్రశ్నిస్తున్నారు. అంతటితో ఆగకుండా తనకు నోబెల్ ఇవ్వకపోతే అది కమిటీకే అవమానమంటూ వ్యాఖ్యానించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. మరోవైపు ఈ ఏడాది శాంతి పురస్కారం ఎవరిని వరిస్తుందనే అంశంపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

#### ఒబామాకు ఇచ్చారు.. నాకెందుకు ఇవ్వరు?

అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు 2009లో నోబెల్ శాంతి బహుమతి ఇవ్వడాన్ని ట్రంప్ మరోసారి ప్రస్తావించారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది నెలలకే ఒబామాకు పురస్కారం దక్కిందని, ప్రపంచ శాంతి కోసం తాను ఎంతో కృషి చేసినా తగిన గుర్తింపు లభించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తన హయాంలో జరిగిన అంతర్జాతీయ దౌత్య ప్రయత్నాలు, ఇజ్రాయెల్--అరబ్ దేశాల మధ్య కుదిరిన అబ్రహం ఒప్పందాలను ట్రంప్ ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. వివిధ దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు తాను కీలకపాత్ర పోషించానని చెబుతున్నారు. అయితే ఎనిమిది యుద్ధాలను ఆపానన్న ట్రంప్ వాదనపై స్వతంత్ర ధ్రువీకరణ అవసరం.

#### నోబెల్ కోసం నామినేషన్ల వెల్లువ

ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి కోసం మొత్తం 287 నామినేషన్లు నమోదయ్యాయి. వీటిలో 208 మంది వ్యక్తులు, 79 సంస్థలు ఉన్నాయి. నార్వేజియన్ నోబెల్ కమిటీ అధికారికంగా ఈ వివరాలను వెల్లడించింది. అయితే నామినేషన్లు పొందిన వ్యక్తులు, సంస్థల పేర్లను 50 ఏళ్లపాటు గోప్యంగా ఉంచుతారు. అందువల్ల బహిరంగంగా వినిపిస్తున్న పేర్లన్నీ అధికారికంగా ఖరారైన అభ్యర్థుల జాబితాగా భావించరాదు.

#### ట్రంప్‌తో పాటు ప్రముఖుల పేర్లు

నోబెల్ శాంతి బహుమతి రేసులో ట్రంప్‌తో పాటు పోప్ లియో పద్నాలుగవ, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొడిమిర్ జెలెన్స్కీ, కెనడా ప్రధాని మార్క్ కార్నే, అమెరికా సెనేటర్ లీసా మర్కోవ్స్కీ, గ్రీన్‌లాండ్ ప్రజాప్రతినిధి అజా చెమ్నిట్జ్ తదితరుల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. అంతర్జాతీయ న్యాయస్థానం, అంతర్జాతీయ నేర న్యాయస్థానం, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం పేర్లు కూడా చర్చకు వస్తున్నాయి. ప్రపంచ శాంతి, మానవ హక్కుల పరిరక్షణ, అంతర్జాతీయ సహకారం వంటి అంశాల్లో ఆయా వ్యక్తులు, సంస్థల పాత్రపై విశ్లేషకులు చర్చిస్తున్నారు. అయితే వీరిలో ఎవరి నామినేషన్‌నూ నోబెల్ కమిటీ అధికారికంగా ధ్రువీకరించలేదు.

#### ఎనిమిది యుద్ధాలు ఆపానంటున్న ట్రంప్

ప్రపంచవ్యాప్తంగా అనేక ఘర్షణలను పరిష్కరించడంలో తన ప్రభుత్వం కీలకపాత్ర పోషించిందని ట్రంప్ ప్రకటిస్తున్నారు. కంబోడియా, థాయ్‌లాండ్, భారత్–పాకిస్థాన్, ఇజ్రాయెల్ తదితర ప్రాంతాల్లో ఉద్రిక్తతలను తగ్గించేందుకు అమెరికా చేసిన ప్రయత్నాలను ప్రస్తావిస్తున్నారు. అయితే కొన్ని ఘర్షణల్లో ట్రంప్ పాత్రపై సంబంధిత పక్షాల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో శాంతి ఒప్పందాల తర్వాత కూడా హింసాత్మక ఘటనలు కొనసాగుతున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం ముగియకపోవడం, ఇరాన్ వివాదంలో అమెరికా పాత్ర కూడా ట్రంప్ శాంతి ప్రయత్నాలపై అంతర్జాతీయ చర్చకు కారణమవుతున్నాయి.

#### మచాడో పురస్కారం ప్రస్తావన

గత ఏడాది నోబెల్ శాంతి బహుమతి పొందిన వెనెజువెలా ప్రతిపక్ష నాయకురాలు మారియా కొరినా మచాడో తన నోబెల్ పతకాన్ని ట్రంప్‌కు అందించిన విషయం మరోసారి చర్చకు వచ్చింది. వెనెజువెలా రాజకీయ పరిణామాల్లో ట్రంప్ మద్దతుకు గుర్తింపుగా ఆమె ఈ చర్య తీసుకున్నారు. అయితే నోబెల్ పురస్కారాన్ని మరొకరికి బదిలీ చేయడం సాధ్యం కాదని నోబెల్ సంస్థ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.

#### నేడే ఉత్కంఠకు తెర

ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి విజేతను అక్టోబర్ 9న శుక్రవారం నార్వే రాజధాని ఓస్లోలో ప్రకటించనున్నారు. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రకటన వెలువడనుంది. డిసెంబర్ 10న పురస్కార ప్రదానోత్సవం నిర్వహిస్తారు. ట్రంప్ ఆశలు ఫలిస్తాయా? లేక ప్రపంచ శాంతి కోసం కృషి చేస్తున్న మరో వ్యక్తిని లేదా సంస్థను ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం వరిస్తుందా? అన్నది మరికొన్ని గంటల్లో తేలనుంది.




ఎండి అబ్దుల్ రహమాన్
ఎడిటర్, ఉద్యమ కెరటం దినపత్రిక


# రాజ్యాంగ సంస్థలు ఎవరి సొత్తు కాదు

- విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నాలు
- అనవసర గందరగోళం సృష్టించరాదు
- మాజీ న్యాయమూర్తుల ఘాటు వ్యాఖ్యలు!



**న్యూఢిల్లీ, అక్టోబర్ 8:** దేశంలోని రాజ్యాంగ సంస్థలపై, ముఖ్యంగా ఎన్నికల సంఘం, ఉన్నత న్యాయవ్యవస్థపై జరుగుతున్న విమర్శలపై 42 మంది మాజీ న్యాయమూర్తులు, పదవీ విరమణ చేసిన అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు దేశ పౌరులను ఉద్దేశించి వారు ఓ బహిరంగ లేఖ విడుదల చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాజకీయ వేదికలపై ఎన్నికల సంఘం అధికారులు, న్యాయస్థానాలపై అవమానకరమైన భాషను ఉపయోగించడం ఆందోళనకరమని లేఖలో పేర్కొన్నారు. కొందరు రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఓట్ల దొంగతనం జరిగిందంటూ ఆరోపణలు చేస్తున్నప్పటికీ, అదే ఆరోపణలకు సంబంధించి కోర్టుల్లో అఫిడవిట్లు, ఆధారాలు సమర్పించే విషయంలో వెనక్కి తగ్గుతున్నాయని వారు విమర్శించారు. ఎన్నికల్లో గెలిచినప్పుడు అదే ఈవీఎంలపై ఆధారపడే పార్టీలు ఓటమి ఎదురైనప్పుడు మాత్రం వాటి విశ్వసనీయతను ప్రశ్నించడం సరికాదని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణపై జరుగుతున్న వివాదాన్ని కూడా మాజీ న్యాయమూర్తులు, అధికారులు ప్రస్తావించారు. 1950 చట్టం ప్రకారం ఓటర్ల జాబితాల సవరణకు చట్టపరమైన ఆధారం ఉందని తెలిపారు. మరణించిన వారు, ఒక ప్రాంతం నుంచి శాశ్వతంగా వెళ్లిపోయిన వారు లేదా అర్హత లేని పేర్లను తొలగించడం, కొత్తగా అర్హత పొందిన పౌరుల పేర్లను చేర్చడం వంటి చర్యలు ఎన్నికల జాబితాలను మరింత ఖచ్చితంగా ఉంచేందుకు ఉద్దేశించినవేనని వివరించారు. నిష్పక్షపాత, విశ్వసనీయ ఎన్నికల కోసం ఓటర్ల జాబితాలను నిరంతరం సరిచేయడం అవసరమని వారు పేర్కొన్నారు. అయితే ఈ పరిపాలనా ప్రక్రియను కుట్రగా చిత్రీకరించడం ద్వారా ప్రజల్లో అనవసరమైన అనుమానాలు, గందరగోళం సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలు విశ్వాసం కోల్పోతే దాని ప్రభావం ప్రజాస్వామ్యంపై తీవ్రంగా ఉంటుందని లేఖలో హెచ్చరించారు. ప్రజల్లో పెరిగే అవిశ్వాసం సామాజిక ఉద్రిక్తతలకు దారితీయవచ్చని, దానిని దేశ వ్యతిరేక శక్తులు తమ ప్రయోజనాలకు ఉపయోగించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగ సంస్థలు ఏ ఒక్క ప్రభుత్వం, రాజకీయ పార్టీకి చెందినవి కావని.. అవి దేశ ప్రజలందరికీ చెందినవని గుర్తుచేశారు. వాటి విశ్వసనీయతను దెబ్బతీయడం అంటే పౌరుల ప్రజాస్వామ్య హక్కులపై ప్రభావం చూపడమేనని తెలిపారు. రాజకీయ పార్టీలు ఎన్నికల్లో తీవ్రంగా పోటీ చేయవచ్చని, అయితే రాజ్యాంగ సంస్థల ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వ్యవహరించకూడదని సూచించారు. ఏదైనా ఫిర్యాదు ఉంటే ఆధారాలతో ఎన్నికల సంఘం లేదా న్యాయస్థానాలను ఆశ్రయించాలని కోరారు. మీడియా సంస్థలు కూడా దర్యాప్తు, ఆధారాలు లేకుండా వచ్చే ఆరోపణలు, పుకార్లను వార్తలుగా ప్రచారం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ సంస్థలు పూర్తి పారదర్శకతతో, రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా పనిచేయాలని సూచించారు. అదే సమయంలో పౌరులు కూడా రాజకీయ వాదనలను గుడ్డిగా నమ్మకుండా వాస్తవాలను పరిశీలించాలని, విశ్వసనీయ ఆధారాల ఆధారంగానే నిర్ణయాలకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజల ఓటు శక్తిపై, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని 42 మంది మాజీ న్యాయమూర్తులు, అధికారులు తమ బహిరంగ లేఖలో పేర్కొన్నారు.

# ఆన్ కార్సన్‌కు సాహిత్య నోబెల్!

### కెనడా రచయిత్రిని వరించిన నోబెల్

### సాహిత్య హద్దులను చెరిపేసిన రచయిత్రి



**న్యూఢిల్లీ, అక్టోబర్ 8 (ఉద్యమ కెరటం):** కెనడాకు చెందిన ప్రముఖ కవయిత్రి, వ్యాసకర్త, అనువాదకురాలు, పండితురాలు ఆన్ కార్సన్‌కు 2026 సాహిత్య నోబెల్ బహుమతి దక్కింది. కవిత్వం, వ్యాసం, అనువాదం, ప్రాచీన సాహిత్యం, కల్పనా రచనల మధ్య ఉన్న సరిహద్దులను చెరిపేస్తూ ప్రత్యేకమైన శైలిని అభివృద్ధి చేసినందుకు ఆమెకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. 1950లో టొరంటోలో జన్మించిన కార్సన్.. చిన్నప్పటి నుంచే ప్రాచీన గ్రీకు సాహిత్యంపై ఆసక్తి పెంచుకున్నారు. టొరంటో విశ్వవిద్యాలయంలో క్లాసిక్స్ చదివి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రాచీన గ్రీకు సాహిత్యం, పురాణాలు ఆమె రచనల్లో కీలక పాత్ర పోషించాయి. కవయిత్రిగానే కాకుండా అనువాదకురాలిగా, వ్యాసకర్తగా, అధ్యాపకురాలిగా కూడా ఆమె విశేష గుర్తింపు పొందారు. కార్సన్ రచనా ప్రత్యేకతకు 'ఆటోబయోగ్రఫీ ఆఫ్ రెడ్' మంచి ఉదాహరణ. 1998లో వెలువడిన ఈ పద్య నవల ప్రాచీన గ్రీకు పురాణంలోని గెరియాన్ కథ ఆధారంగా రూపొందింది. హెరాకిల్స్ చేతిలో హతమైన రెక్కల రాక్షసుడి కథను కార్సన్ ఒక సున్నితమైన యువకుడి ప్రేమ, ఎదుగుదల, వ్యక్తిత్వ అన్వేషణ కథగా మలిచారు. అలాగే ఎలెక్ట్రా, సాఫో వంటి ప్రాచీన గ్రీకు రచనలను అనువదించడం ద్వారా తన శాస్త్రీయ పాండిత్యాన్ని సృజనాత్మక రచనతో మేళవించారు. 2026 నోబెల్ రేసులో కార్సన్ పేరు ముందంజలోనే ఉంది. సాహిత్య ప్రక్రియల మధ్య గీతలను ప్రశ్నిస్తూ దశాబ్దాలుగా సాగించిన ప్రయోగాత్మక రచనకు ఈ పురస్కారం అంతర్జాతీయ గుర్తింపుగా నిలిచింది. ఇప్పటివరకు అన్నే కార్సన్ రచనలు, అనువాదాలకు సంబంధించి 20కిపైగా పుస్తకాలు ప్రచురితమయ్యాయి. గ్రిఫిన్ పోయెట్రీ ప్రైజ్, లానన్ లిటరరీ అవార్డు వంటి పలు ప్రతిష్ఠాత్మక సాహిత్య పురస్కారాలను ఆమె అందుకున్నారు. ఇప్పుడు నోబెల్ సాహిత్య పురస్కారం కూడా ఆమె ఖాతాలో చేరింది. 2025లో హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్నహోర్కైకి నోబెల్ సాహిత్య పురస్కారం లభించింది. ఆయన రచనల్లో కనిపించిన వినూత్నతకు ఈ గౌరవం దక్కింది. తాజాగా 2026లో అన్నే కార్సన్ ఈ అవార్డును అందుకున్నారు. 1901 నుంచి 2025 వరకు నోబెల్ సాహిత్య పురస్కారం 118 సార్లు ప్రకటించగా, మొత్తం 122 మంది ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఇప్పటివరకు 18 మంది మహిళలు నోబెల్ సాహిత్య పురస్కారం పొందారు. 1909లో స్వీడన్‌కు చెందిన సెల్మా లాగర్‌లెఫ్ ఈ అవార్డు అందుకున్న తొలి మహిళగా నిలిచారు. ఈ ఏడాది నోబెల్ పురస్కారం కింద 12 మిలియన్ స్వీడిష్ క్రోనాలు, భారత కరెన్సీలో రూ.11 కోట్లకు పైగా నగదు బహుమతి అందనుంది. ఒక విభాగంలో ఒకరి కంటే ఎక్కువ మంది విజేతలు ఉంటే ఈ మొత్తాన్ని సమానంగా పంచుతారు. ఇక నోబెల్ పురస్కారాల ప్రకటనల్లో భాగంగా శుక్రవారం నోబెల్ శాంతి బహుమతిని ప్రకటించనున్నారు. అక్టోబర్ 12న అర్థశాస్త్రంలో నోబెల్ స్మారక పురస్కారాన్ని ప్రకటించనున్నారు.



### సీఈసీ, కమిషనర్ల నియామకాలు

# రద్దు చేయాలి

### నియామకాన్ని సవాలు చేస్తూ సుప్రీంలో పిటిషన్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 8:** దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న తరుణంలో, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ నియామకానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనతో పాటు మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకాలను సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి నియామకాలను రద్దు చేయాలని పిటిషనర్ కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామకం ప్రక్రియకు సంబంధించి తీసుకువచ్చిన 2023 చట్టాన్ని సైతం ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. ముఖ్యంగా కమిషనర్లను ఎంపిక చేసే కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగించడాన్ని పిటిషనర్ తీవ్రంగా తప్పుబట్టారు. మరోవైపు, 'సర్' ప్రక్రియను రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ పాల్గొన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా ఒక్కటే తమ అంతిమ లక్ష్యం కాదని, ఆయన స్థానంలో మరొకరు వచ్చినా మార్పు ఉండదని, అందుకే ఆ వివాదాస్పద ప్రక్రియనే పూర్తిగా రద్దు చేయాలని నిరసనకారులు స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో సమూల ప్రక్షాళన జరగాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీ నుంచి సీజేపీ, వివిధ విద్యార్థి సంఘాలు సుదీర్ఘ పోరాటాలకు పిలుపునిచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఢిల్లీ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించేందుకు సిద్ధమవుతోంది.

# వ్యాపారులకు భారీ ఊరట

### పన్ను అధికారులకు అరెస్ట్ అధికారం రద్దు

### ప్రాసిక్యూషన్ పరిమితి రూ. 5 కోట్లకు పెంపు

### ఇ-కామర్స్ వ్యాపారులకు జరిమానా తగ్గింపు

### ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పై అధ్యయనానికి కమిటీ

### జీఎస్టీ నిభంధనల్లో సంచలన మార్పులు

### జీఎస్టీ రేట్లలో ఊరట.. ఈసారి లేని మార్పులు

### 57వ జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు!

**న్యూఢిల్లీ, అక్టోబర్ 8 (ఉద్యమ కెరటం):** జీఎస్టీ కౌన్సిల్ గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో ఒక ముఖ్యమైన సమావేశం నిర్వహించింది. ఈ కౌన్సిల్ ఒక కీలకమైన, చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, జీఎస్టీ కింద ఎటువంటి అరెస్టులు జరగవు. జీఎస్టీ కింద అరెస్ట్ చేసే అధికారాన్ని కౌన్సిల్ పూర్తిగా తొలగించింది. అలాగే, ప్రాసిక్యూషన్ పరిమితిని రూ. 1 కోటి నుండి రూ. 5 కోట్లకు పెంచింది. జీఎస్టీ విధానంలో కేంద్ర ప్రభుత్వం మరో కీలక సంస్కరణకు శ్రీకారం చుట్టింది. ఢిల్లీలోని భారత్ మండపంలో గురువారం జరిగిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పన్ను చెల్లింపుదారులకు సంబంధించిన అమలు, ప్రాసిక్యూషన్ నిబంధనలపై ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా జీఎస్టీ అధికారులకు ఉన్న అరెస్ట్ అధికారాలను తొలగిస్తూ.. కౌన్సిల్ నిర్ణయించింది. దీంతో జీఎస్టీ ఉల్లంఘనలకు సంబంధించి పన్ను అధికారులు నేరుగా అరెస్ట్ చేసే అవకాశం ఇక ఉండదు. ఇప్పటివరకు తీవ్రమైన పన్ను ఎగవేత, నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వంటి కొన్ని కేసుల్లో జీఎస్టీ అధికారులు అరెస్ట్ చేసే అధికారం ఉంది. ఈ అధికారాన్ని పరిమితం చేయడం ద్వారా సాధారణ పన్ను వివాదాలు, వ్యాపార సంబంధిత పొరపాట్లు క్రిమినల్ చర్యల స్థాయికి వెళ్లకుండా చూడాలనే ఉద్దేశంతో సంస్కరణలు తీసుకొచ్చింది కేంద్రం. పన్ను బకాయిల వసూలు, వడ్డీ, జరిమానాల విధింపు వంటి ఇతర చర్యలు మాత్రం కొనసాగుతాయి. అదే సమయంలో జీఎస్టీ కింద ప్రాసిక్యూషన్ ప్రారంభించే పరిమితిని కూడా భారీగా పెంచారు. ఇప్పటివరకు రూ.1 కోటి పన్ను ఎగవేతకు సంబంధించిన కేసుల్లో ప్రాసిక్యూషన్ ప్రారంభించే అవకాశం ఉండగా.. ఇకపై ఆ పరిమితిని రూ.5 కోట్లకు పెంచారు. అంటే రూ.5 కోట్లకు లోబడిన పన్ను ఎగవేత కేసుల్లో క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు వెళ్లే అవకాశం తగ్గనుంది. ఈ మార్పులను పన్ను వ్యవస్థను మరింత సులభతరం చేయడం, వ్యాపార సంస్థలపై అనవసరమైన చట్టపరమైన ఒత్తిడిని తగ్గించడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మెరుగుపరచడం వంటి లక్ష్యాలతో కొత్త సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. జీఎస్టీ 2.0లో భాగంగా కేవలం అరెస్ట్, ప్రాసిక్యూషన్ నిబంధనలే కాకుండా.. రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడం, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వ్యవస్థలో మార్పులు, రిఫండ్లను వేగవంతం చేయడం, వివాదాలను తగ్గించడం వంటి పలు అంశాలపై కూడా కౌన్సిల్ దృష్టి సారించింది. మొత్తంగా చూస్తే, జీఎస్టీ అమలులో కఠినమైన క్రిమినల్ చర్యల కంటే పన్ను వసూళ్లు, అనుసరణ, సులభమైన వ్యాపార విధానాలకు ప్రాధాన్యం ఇచ్చే దిశగా తాజా నిర్ణయాలు ఉన్నాయని చెప్పొచ్చు. అయితే ఈ మార్పులు పూర్తిగా అమల్లోకి రావడానికి అవసరమైన చట్టపరమైన సవరణలు, తదుపరి ప్రక్రియ కూడా కీలకం కానున్నాయి.



# భూముల రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ కే హరిత

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావులతో కలిసి తహసిల్దార్లు, నాయబ్ తహసిల్దార్లు, గిర్దావార్లు, గ్రామ పాలన అధికారులు (జిపిఓలు), రెవెన్యూ సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ సర్వేపై తహసిల్దార్ నుండి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. డిజిపిఎస్ రోవర్స్ ద్వారా భూ కొలతలు నిర్వహించే విధానాన్ని సరిగ్గా అవగాహన చేసుకుంటే క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులు, భూముల సర్వేను పక్కాగా పూర్తి చేయాలని, ఈ రీ సర్వే ద్వారా భవిష్యత్తులో సరిహద్దు వివాదాలు తలెత్తకుండా పక్కాగా రెవెన్యూ రికార్డులను నిర్వహించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా భూ కొలతల అధికారి వినయ్, వివిధ మండలాల తహసిల్దార్లు, నాయబ్ తహసిల్దార్లు, గిర్దావార్లు, జిపిఓలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ కే హరిత
- ఘనంగా 'టీబీ ముక్త్ పంచాయతీ'ల సన్మాన కార్యక్రమం
- క్షయ రహితంగా నిలిచిన 6 గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, సిబ్బందికి పురస్కారాలు

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని జిల్లా కలెక్టర్ కె.హరిత పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "క్షయ నిర్మూలనకు యువత సన్నద్ధం - టి.బి. ముక్త్ పంచాయతీలు" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీబీ అనేది అంటు వ్యాధి అని, ప్రాథమిక దశలోనే దీని లక్షణాలను గుర్తించి 6 నెలల పాటు క్రమం తప్పకుండా సరైన చికిత్స, పోషకాహారం అందిస్తే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను చైతన్య పరచడంలో యువత, వైద్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ పాలకవర్గాలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. లక్షణాలు ఉన్నవారి సమాచారాన్ని వెంటనే వైద్య సిబ్బందికి అందించాలని కోరారు.



### 'టీబీ ముక్త్' పంచాయతీలకు సన్మానం

జిల్లాలో క్షయ రహిత గ్రామపంచాయతీలుగా ఎంపికైన గోవింద్‌పూర్(ఆసిఫాబాద్), పోతేపల్లి(బెజ్జూర్), పవార్‌గూడ(జైనూర్), సాంగ్వి(కెరమెరి), ఇటిక్యాలపహాడ్ (సిర్పూర్-టి), దాబా(వాంకిడి) సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందిని కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ వెంకట్, ఎంపీడీఓలు, వైద్యులు, ఎన్.సి.సి. విద్యార్థులు, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



# ఓటు చోరీని ఆపాలి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి



### కాంగ్రెస్ నిరసన

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్: దేశంలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడటంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఆత్రం సుగుణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణను డిమాండ్ చేస్తూ గురువారం ఆసిఫాబాద్ పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. అనంతరం నియోజకవర్గ ఇన్చార్జి శ్యాంనాయక్ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణ మాట్లాడుతూ "దేశంలో ఓటు చోరీకి తావులేకుండా ఎన్నికల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరగాలి. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలి. నిబంధనలకు విరుద్ధంగా ఎవరి ఓటు హక్కునూ అన్యాయంగా తొలగించకూడదు" అని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నాయకులు లేవనెత్తుతున్న ప్రజాస్వామ్యబద్ధమైన సందేహాలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం మరియు ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి అజ్మీర శ్యాం నాయక్ మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీలో ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు వెళ్లిన అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు ఇండియా కూటమి ఎంపీలను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును అణచివేయడమేనని విమర్శించారు. "ఓటు చోరీని ఆపాలి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి" అని పిలుపునిస్తూ, బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ హక్కుల రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ తారిక్, మండల అధ్యక్షుడు మురళి, పట్టణ అధ్యక్షుడు ఇమ్రాన్, వాంకిడి మండల అధ్యక్షుడు మంగాజి, కెరమెరి మండల అధ్యక్షుడు సుజాహిద్ ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాజుల జక్కయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ గడ్డల సత్తయ్య, సీనియర్ నాయకులు చిట్ల నారాయణ, బాలు యాదవ్, మహమ్మద్, విశ్వనాథ్, శంకర్, పేంటు, మహిళా నాయకురాలు కళావతి, యువజన కాంగ్రెస్ నాయకులు సాయికుమార్, ఎలాగల, నైతంబాను తదితరులు పాల్గొన్నారు.



# విభేదాలను వీడి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

## ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ పిలుపు

### కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్.. కరీంనగర్ పట్టణ అధ్యక్షుడిగా అతీఫ్ నియామకం

**ఉద్యమ కెరటం, కరీంనగర్ :** ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ ఏఐఎంఐఎం పార్టీ కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, పట్టణ అధ్యక్షుడు గా మహమ్మద్ అతిఫ్ అతినాలను నియమించినట్లు, పార్టీ అధ్యక్షుడు బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ను, ఆతీఫ్ అతినాలను హైదరాబాద్ దారుస్సలాంలో నియామకపు ఉత్తర్వులను బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ అందజేశారు. గ్రూపు రాజకీయాలను, వర్గ విభేదాలను పక్కన బెట్టి ఎంఐఎం బలోపేతం చేసేందుకు కృషి చేయాలని, కరీంనగర్ జిల్లా, పట్టణ కమిటీకి దిశానిర్దేశం చేశారు. కలిసి కట్టుగా ఉండి పార్టీని పటిష్టపరిచేందుకు కృషి చేయాలని కోరారు. తనపై గురుతరమైనటువంటి బాధ్యతతో కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జిల్లాల అధ్యక్షుడిగా నియమించిన ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీకి గులాం అహ్మద్ హుస్సేన్ సర్వదా కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్ పెద్దపల్లి సిరిసిల్ల జిల్లాల్లో పార్టీ అభివృద్ధి కోసం తన శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు.



# కేజీబీవీ అతిథి ఉపాధ్యాయుల ఎంపికలో పారదర్శకత పాటించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం జిల్లాలో నిర్వహించిన ప్రతిని ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అతిథి ఉపాధ్యాయుల ఎంపికలో అభ్యర్థుల బోధనా నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్కు ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హత కలిగిన అభ్యర్థులను పూర్తిగా పారదర్శకంగా, మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేయాలని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా నిబంధనల ప్రకారం



నిర్వహించాలని తెలిపారు. అభ్యర్థులు ప్రదర్శించిన బోధనా తీరును స్వయంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. అర్హత, ప్రతిభ కలిగిన అభ్యర్థులకు మాత్రమే అవకాశం లభిస్తుందని తెలిపారు. అభ్యర్థులు దళారులు, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని, అతిథి ఉపాధ్యాయుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, సెక్టోరల్ అధికారులు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషనర్ను వెంటనే తొలగించాలి

**• ఖమ్మంలో అఖిలపక్షాల భారీ నిరసన**




**ఉద్యమ కెరటం, ఖమ్మం:** ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ను పదవి నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం నగరంలో గురువారం అఖిలపక్షాల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ఎంఎల్ న్యూ డెమోక్రసీ తదితర వామపక్ష, ప్రజాస్వామ్య పార్టీల నాయ కులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా నాయకులు ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ వ్యవహారశైలిపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, ఆయనను తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియ అత్యంత కీలకమని, అది పారదర్శకంగా, నిస్పక్షపాతంగా సాగినప్పుడే ప్రజలకు ఎన్నికల వ్యవస్థపై విశ్వాసం ఉంటుందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించి తలెత్తిన అంశాలపై ప్రభుత్వం, ఎన్నికల సంఘం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటంతో పాటు ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తుడా చైర్మన్ దుర్గా ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్, ఖమ్మం టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ చౌదరి, పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి తుమ్మూరు దయాకర్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుచ్చా బొందయ్య, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, సీపీఎం నాయకుడు నున్నా నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శులు యర్రా సత్యనారాయణ, దామర్ల రమేష్, హలావత్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి, సాంప్రదాయలను కాపాడుకోవాలి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** సంస్కృతి, సాంప్రదాయలను కాపాడుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్ సింగ్ అన్నారు. బతుకమ్మ పండగ సంబరాల్లో భాగంగా గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినిలు బతుకమ్మ ఆడారు. రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలోనంటూ ఆడిపాడారు. ఈ సంద్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ రాణి, డాక్టర్ అనిత, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**ఉద్యమ కెరటం నేరడిగొండ:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, బతుకమ్మ చుట్టూ పాటలు పాడుతూ ఆనందంగా వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అని తెలిపారు. యువత మన సంస్కృతిని, సాంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ షబాన తరన్నుం మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సుజాతబాయి, మమత, జాహ్నవి, రేఖ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఖాబ్రస్తాన్ స్థల సమస్యకు త్వరలో పరిష్కారం

**ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి,** ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలోని వేంసూరు రోడ్డులో నీలాద్రి అర్బన్ పార్క్ సమీపంలో ఉన్న ఖాబ్రస్తాన్ స్థల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ హామీ ఇచ్చారు. ఖాబ్రస్తాన్ స్థలానికి సంబంధించి గత కొన్నేళ్లుగా అటవీ శాఖ అధికారులకు, ముస్లిం సమాజానికి మధ్య కొనసాగుతున్న వివాదాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ కలెక్టర్ దివాకర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యకు సంబంధించిన వివరాలను కలెక్టర్కు వివరించి, ఖాబ్రస్తాన్ స్థల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ దివాకర్ డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్తో కలిసి గురువారం ఖాబ్రస్తాన్ స్థలాన్ని పరిశీలించారు. స్థల పరిస్థితులను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులతో చర్చించి, సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి అజయ్ యాదవ్, తహశీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, అటవీ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి వాట్సాప్ గ్రీవెన్స్ సెల్

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లా ప్రజల సమస్యలను సులభంగా వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక వాట్సాప్ గ్రీవెన్స్ సెల్ ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులు, వినతుల కోసం ప్రతిసారి కలెక్టరేట్ కు రావాల్సిన అవసరం లేకుండా, ఇంటి వద్ద నుంచే తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా ఈ డిజిటల్ వేదికను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు తమ ఫిర్యాదులను వాట్సాప్ నంబర్ 9492341947 కు మెసేజ్ రూపంలో పంపవచ్చని, ఫిర్యాదుతో పాటు సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలు, ప్రదేశం, చిరునామా, అవసరమైన ఆధారాలు, ఫోటోలు పంపించాలని సూచించారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును ప్రత్యేక బృందం నమోదు చేసి వెంటనే సంబంధిత శాఖాధికారులకు పంపిస్తుందని, ఫిర్యాదుల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్ణీత కాలపరిమితిలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా ప్రజలు ఈ వాట్సాప్ గ్రీవెన్స్ సెల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సేవలకు సంబంధించిన ఫిర్యాదులను మాత్రమే ఈ నంబర్ కు పంపించాలని, అనవసరమైన, తప్పుడు సందేశాలను పంపవద్దని సూచించారు. ఈ నంబర్ ను కేవలం వాట్సాప్ సేవల కోసం మాత్రమే వినియోగించాలని, ఫోన్ కాల్స్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

# సీతారామ జలాలతో రైతన్నకు భరోసా

**• తల్లాడ, కల్లూరు మండలాలకు సాగునీటి ఊతం**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సీతారామ జలాలతో రైతన్నకు భరోసా లభిస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. తల్లాడ మండలంలోని ఏన్కూర్ లాకల్ వద్ద సీతారామ ప్రాజెక్టు కెనాల్ నుంచి సిరిపురం మేజర్ కాలువకు గోదావరి జలాలను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ తో కలిసి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా అందుతున్న గోదావరి జలాలు తల్లాడ, కల్లూరు మండలాల్లోని పంట పొలాలకు చేరనున్నాయని తెలిపారు. సాగునీరు సమృద్ధిగా అందుబాటులోకి రావడంతో రైతులు పంటలను సాగు చేసుకునేందుకు మరింత భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. సాగునీటి వసతి పెరగడంతో పంట పొలాలు సస్యశ్యామలంగా మారి మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను అందుబాటులోకి తీసుకువస్తున్న ప్రభుత్వానికి రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్రెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా పూర్తి చేయాలి

**• ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా పూర్తి చేయాలని విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా అన్నారు. జిల్లాలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో కలిసి గురువారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన సవరణ కేంద్రాన్ని సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులతో సమావేశమైన యోగితా రాణా ఓటర్ల నమోదు, దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని బీఎల్ఓలకు సూచించారు. కొత్తగా అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్ల వివరాల్లో ఎలాంటి తప్పులు లేకుండా జాబితాను పారదర్శకంగా రూపొందించాలని, సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా నిబంధనల మేరకు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జగదీశ్వరావు, తహశీల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యాన్ని మించిన సంపద మరొకటి లేదు



**ఉద్యమ కెరటం, తాండూర్:** ఆరోగ్యాన్ని మించిన సంపద మరొకటి లేదని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీరమేష్ అన్నారు. గోలేటిలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో కంపెనీ స్థాయి వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ పోటీల్లో సింగరేణి పరిధిలోని 11 ఏరియాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన జీఎం మొదట ఒలింపిక్ పతాకాన్ని ఆవిష్కరించి, ఆంజనేయస్వామి చిత్రపటం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ ఏరియాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారని, ఆరోగ్యమే నిజమైన సంపద అని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. విజయం సాధించినప్పుడు ఆనందపడటంతో పాటు, ఓటమి ఎదురైనప్పుడు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకుని తదుపరి విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ కోల్ ఇండియా స్థాయి పోటీలను ఆర్జీ-2 ఏరియాలో నిర్వహించనున్నట్లు తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో కోల్ ఇండియా స్థాయి పోటీలు జరగనున్న నేపథ్యంలో గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధించేలా క్రీడాకారులు పట్టుదలతో సాధన చేయాలని ఆకాంక్షించారు. మారుమూల ప్రాంతమైన గోలేటికి వివిధ ఏరియాల నుంచి వచ్చిన ఉద్యోగ క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు, వసతి కల్పించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఏరియా అధికారుల సంఘం కార్యదర్శి వీరన్న, డీజీఎం ఉజ్వల్ కుమార్ బెహరా, డీజీఎం పర్సనల్ డి.కిరణ్ బాబు, ఎస్ఓ టు జీఎం స్వామిరాజు, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి డి.ప్రశాంత్, సీనియర్ స్పోర్ట్స్ సూపర్వైజర్ నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ సూపర్వైజర్లు చాట్ల అశోక్, పర్ష శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్ బాబు, జనరల్ కెప్టెన్ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.



# భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌కు భారీ క్రేజ్..

- **ఏడాదికి ముందే లక్షకుపైగా దరఖాస్తులు..**

ఐసీసీ పురుషుల వన్డే ప్రపంచకప్ 2027కు సంబంధించిన టికెట్ల వేటలో భారత్, పాకిస్థాన్ మ్యాచ్ సృష్టించిన క్రేజ్ మామూలుగా లేదు. అక్టోబర్ 1, 2026న టికెట్ బ్యాలెట్ ఓపెన్ అయినప్పటి నుంచి ఇప్పటివరకు ఏకంగా పది లక్షలకు పైగా టికెట్ దరఖాస్తులు రాగా, అందులో అక్టోబర్ 10న జరగనున్న ఇండియాపాకిస్థాన్ మ్యాచ్ కోసమే ఏకంగా లక్షకు పైగా అప్లికేషన్లు దాఖలయ్యాయి. మ్యాచ్‌కు ఇంకా ఏడాది సమయం ఉండగానే ఇంత క్రేజ్ రావడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ 14వ ఎడిషన్ ప్రపంచకప్ టోర్నీ 2027 అక్టోబర్ 2 నుంచి నవంబర్ 21 వరకు జరగనుంది. ఇప్పటి వరకు దాదాపు 3,20,000 మందికి పైగా అభిమానులు ఈ మూడు దేశాల్లో జరిగే రకరకాల మ్యాచ్‌ల టికెట్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దీన్నిబట్టి ఈ మెగా టోర్నీపై అభిమానుల్లో ఏ రేంజ్ అంచనాలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. డిమాండ్ విషయంలో ఇండియాపాకిస్థాన్ మొదటి స్థానంలో ఉంటే, ఆ తర్వాతి స్థానాల్లోనూ టీమిండియా మ్యాచ్‌లే రాజ్యమేలుతున్నాయి. 86,000కు పైగా దరఖాస్తులతో సౌతాఫ్రికాఇండియా మ్యాచ్ రెండో స్థానంలో నిలవగా, 80,000కు పైగా అప్లికేషన్లతో ఇండియాఆస్ట్రేలియా మ్యాచ్ మూడో స్థానంలో ఉంది. ఇవే కాకుండా మరో ఇండియాపాకిస్థాన్ మ్యాచ్‌కి కూడా ఫ్యాన్స్ నుంచి భారీ రెస్పాన్స్ వస్తోంది. నవంబర్ 7న జరగబోయే ప్రీసీడెడ్ సూపర్ 7 రౌండ్‌లో ఇండియా (A1), పాకిస్థాన్ (A3) త్యాగయ్యే మ్యాచ్ కోసం దాదాపు 75,000 అప్లికేషన్లు వచ్చాయి. ఇక జోహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ మైదానంలో జరిగే గ్రాండ్ ఫైనల్ మ్యాచ్ టికెట్ల కోసం దాదాపు 65,000 మంది అభిమానులు పోటీ పడుతున్నారు.




ఈ టోర్నీ టికెట్ ధరలు అందరికీ అందుబాటులో ఉండేలా ప్లాన్ చేశారు. ప్రారంభ టికెట్ ధర 9.62 అమెరికన్ డాలర్లు (రూ. 158) కాగా, హైటైర్ మ్యాచ్‌లకు గరిష్ట ధర 31.31 అమెరికన్ డాలర్లుగా (రూ. 514) నిర్ణయించారు. వీటికి తోడు ఫ్యామిలీ బండిల్స్, విద్యార్థులు, పెన్షనర్లకు ప్రత్యేక తగ్గింపులు, స్థానికులకు ముందస్తు కేటాయింపులతో పాటు కమ్యూనిటీ క్లబ్‌లు, పాఠశాల విద్యార్థుల బృందాల కోసం ప్రత్యేక ఆఫర్లను కూడా సిద్ధం చేశారు. కేవలం 48 గంటల్లోనే దాదాపు పది లక్షలకు పైగా టికెట్ అప్లికేషన్లు రావడం ఈ ప్రపంచకప్‌కు ఉన్న క్రేజ్‌ను స్పష్టంగా చూపిస్తోందని ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా ఆనందం వ్యక్తం చేశారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఐసీసీ మెగా పురుషుల టోర్నీ మళ్లీ ఆఫ్రికా ఖండానికి తిరిగి రావడం అక్కడ అత్యంత కీలకమైన ఘట్టమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 120కి పైగా దేశాల నుంచి దాదాపు 2.5 బిలియన్ల క్రికెట్ ప్రేమికులను ఈ టోర్నీ ఆకట్టుకోనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.



## ఐపీఎల్‌కు పోటీగా షెడ్యూల్..
## పీఎస్ఎల్‌కు కష్టమే బాసూ!

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 12వ సీజన్‌కు సంబంధించి కీలక ప్రకటన చేసింది. 2027 మార్చి 18 నుంచి మే 2 వరకు టోర్నీ నిర్వహించనున్నట్లు వెల్లడించింది. సెప్టెంబర్ 1న లండన్‌లో జరిగిన పీఎస్ఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఎనిమిది ఫ్రాంచైజీల యజమానులు, ప్రతినిధులతో చర్చించిన అనంతరం షెడ్యూల్ ఖరారు చేసింది. 2026లో ఎనిమిది జట్లకు విస్తరించిన లీగ్.. వరుసగా రెండో ఏడాది కూడా అదే ఫార్మాట్ లో జరగనుంది. గత సీజన్‌లో అద్భుత ప్రదర్శనతో టైటిల్ గెలుచుకున్న పెషావర్ జల్మీ డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది. మే 3న గడ్డాఫీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో కొత్తగా లీగ్‌లోకి వచ్చిన హైదరాబాద్ కింగ్స్‌మెన్‌ను ఐదు వికెట్ల తేడాతో ఓడించి పెషావర్ విజేతగా నిలిచింది. 2026 సీజన్‌లో ఎనిమిది జట్లు పోటీపడగా.. హైదరాబాద్ కింగ్స్‌మెన్, రావల్పిండిజ్ కొత్త ఫ్రాంచైజీలుగా చేరాయి. అంతేకాకుండా ఆటగాళ్ల ఎంపికలో గతంలో ఉన్న డ్రాఫ్ట్ విధానానికి బదులుగా వేలం పద్ధతిని ప్రవేశపెట్టారు.

పీఎస్ఎల్ 2026 సీజన్‌కు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభించిందని పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో ప్రేక్షకులు స్టేడియాలకు రావడంతో పాటు ప్రసారాలకూ విశేష ఆదరణ లభించిందని తెలిపారు. పీఎస్ఎల్ 12వ సీజన్‌ను మరింత ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఎనిమిది ఫ్రాంచైజీలు మరోసారి టైటిల్ కోసం పోటీపడనున్నాయని పేర్కొన్నారు. గత సీజన్‌లో గడ్డాఫీ స్టేడియంలో జరిగిన ఫైనల్‌కు 32,461 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. ఇది టోర్నీ చరిత్రలో రికార్డు స్థాయి ప్రేక్షకుల హాజరు. ఈ విజయాన్ని కొనసాగిస్తూ 2027 సీజన్‌లోనూ మరింత ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లు, మెరుగైన ప్రసార అనుభవాన్ని అందించాలని పీసీబీ లక్ష్యంగా పెట్టుకుంది.

పీఎస్ఎల్ 2027 కోసం ఫ్రాంచైజీలు తమ జట్లను సిద్ధం చేసుకునే ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది. ఇందుకోసం ఆటగాళ్లను నేరుగా ఒప్పందం చేసుకోవడం, పాత జట్ల నుంచి ఆటగాళ్లను రిటైన్ చేసుకోవడం, ట్రేడ్ విండో, ఆటగాళ్ల వేలం వంటి దశలు జరగనున్నాయి. 2026లో ప్రవేశపెట్టిన రెండేళ్ల కాంట్రాక్టుల విధానం ప్రకారం.. ఫ్రాంచైజీలు తమ గత సీజన్ జట్టు నుంచి గరిష్ఠంగా ఏడుగురు ఆటగాళ్లను కొనసాగించవచ్చు. ప్రతి జట్టులో 16 నుంచి 20 మంది ఆటగాళ్లు ఉండాలి. ఇందులో కనీసం ఇద్దరు అన్‌క్యాప్డ్ అండర్23 ఆటగాళ్లు తప్పనిసరిగా ఉండాలి. అంతేకాకుండా ప్రతి మ్యాచ్‌లో ఆడే తుది జట్టులో కనీసం ఒక అండర్23 ఆటగాడికి అవకాశం కల్పించాలి. ఈ నిబంధనల నేపథ్యంలో ఫ్రాంచైజీలు తమ జట్ల కూర్పుపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నాయి.

పీఎస్ఎల్ 2027లో ఇస్లామాబాద్ యునైటెడ్, కరాచీ కింగ్స్, లాహోర్ ఖలందర్స్, ముల్తాన్ సుల్తాన్స్, పెషావర్ జల్మీ, క్వెట్టా గ్లాడియేటర్స్, హైదరాబాద్ కింగ్స్‌మెన్, రావల్పిండిజ్ జట్లు పోటీపడనున్నాయి. అయితే మార్చి నుంచి మే వరకు టోర్నీ జరగనుండటంతో విదేశీ ఆటగాళ్ల లభ్యత ఫ్రాంచైజీలకు సవాలుగా మారే అవకాశం ఉంది. ఇదే సమయంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) కూడా జరగనుండటంతో.. కొన్ని దేశాల ఆటగాళ్లకు షెడ్యూల్ పరంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది. చాలా మంది ప్లేయర్స్ ఐపీఎల్ ఆడేందుకే ఆసక్తి చూపుతారు. దాంతో పీఎస్ఎల్‌కు షాక్ తగలనుంది.

## కుర్రాళ్లు భయపడడంలేదు..
## కుమ్మేస్తున్నారు: గేల్




ఆధునిక క్రికెట్‌లో యువ బ్యాటర్లు ప్రదర్శిస్తున్న నిర్భయమైన, దూకుడైన ఆటతీరును వెస్టిండీస్ దిగ్గజ క్రికెటర్ క్రిస్ గేల్ ప్రశంసించాడు. కొత్త తరం క్రికెటర్లు ఎలాంటి జంకు లేకుండా మొదటి బంతి నుంచే దాడికి దిగడం వల్లే ఆటలో స్కోరింగ్ రేటు, పవర్ హిట్టింగ్ గణనీయంగా పెరిగాయని ఈ 'యూనివర్స్ బాస్' అభిప్రాయపడ్డాడు. ఈ మార్పు క్రికెట్‌కు సానుకూలమైన పరిణామమని పేర్కొన్నాడు. షార్జా క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (WCL) సందర్భంగా గేల్ మీడియాతో మాట్లాడాడు. "బౌలర్లు కాకుండా బ్యాటర్లు రికార్డులు బద్దలు కొడుతుండడం నాకు సంతోషంగా ఉంది. దీనికి కారణం, యువతరం ఇప్పుడు భయం లేని క్రికెట్ ఆడుతోంది. మొదటి బంతి నుంచే దాడి చేస్తున్నారు. ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా ఆడుతున్నారు. ఆట మారింది, ఆటగాళ్లు మారారు. పరుగులు చేయడానికి బ్యాటర్లు ఆకలితో ఉన్నారు. వారి నిర్భయమైన ఆటతీరు క్రికెట్‌కు ఎంతో మేలు చేస్తుంది" అని గేల్ వివరించాడు. ఇదే అంశంపై వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో బౌలర్ల కోణంలో స్పందించాడు. బ్యాటర్ల దూకుడు ఆటకు అద్భుతంగా మేలు చేస్తున్నప్పటికీ, బౌలర్లు ఈ కొత్త శకానికి అనుగుణంగా తమను తాము మార్చుకోవాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పాడు. "ప్రపంచవ్యాప్తంగా బ్యాటింగ్ తీరు చూస్తుంటే, ఇప్పటి ఆటలో నేను లేనందుకు సంతోషంగా ఉంది. బ్యాటర్ల నైపుణ్యాలు విపరీతంగా పెరిగాయి. ఈ మార్పులకు అనుగుణంగా బౌలర్లు కూడా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి, కొత్త ఆవిష్కరణలు చేయాలి" అని బ్రావో అన్నాడు. భవిష్యత్తులో వన్డేల్లో 400, 500 పరుగుల స్కోర్లు కూడా ఆశ్చర్యం కలిగించవని జోస్యం చెప్పాడు. వెస్టిండీస్ ఛాంపియన్స్ జట్టు యజమాని అజయ్ సేథి మాట్లాడుతూ.. ఒకప్పుడు గేల్, బ్రావో వంటి విండీస్ స్టార్లు దూకుడైన బ్యాటింగ్‌ను ఒక సంచలనంగా ప్రారంభిస్తే, అది ఇప్పుడు ప్రపంచవ్యాప్త ట్రెండ్‌గా మారిందని పేర్కొన్నారు. "వెస్టిండీస్ ప్రారంభించిన ఈ దూకుడైన బ్యాటింగ్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్నారు. విండీస్ క్రికెట్‌కు పర్యాయపదంగా మారిన నిర్భయమైన విధానం ఇప్పుడు అన్ని దేశాల జట్లలో కనిపిస్తోంది" అని అన్నారు.




## ఇప్పటికీ ఫిట్.. బరువు తగ్గకుండానే
## బలం పెంచిన భువనేశ్వర్ కుమార్!

టీమిండియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్భుత ప్రదర్శనతో అందరినీ ఆశ్చర్యపరిచడం తెలిసిందే. 36 ఏళ్ల వయసులోనూ స్థిరంగా 140 కిలోమీటర్ల వేగంతో బంతులు విసరడమే కాకుండా, ఏకంగా 28 వికెట్లు పడగొట్టి ఓ భారత బౌలర్‌గా అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. వయసు పైబడటంతో కెరీర్ ముగిసిపోయిందనుకున్న దశలో.. నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు టీమిండియాలోకి పునరాగమనం చేశాడు. ఈ రేంజ్ పునరాగమనం వెనుక అతడి కఠోర శ్రమ, అసాధారణ శారీరక పరివర్తన ఉంది. ఈ మార్పు వెనుక ఉన్న రహస్యాలను అతడి పర్సనల్ ట్రైనర్ సూర్య యాదవ్ ఓ జాతీయ మీడియాకు వెల్లడించాడు. గత మూడేళ్లలో భువనేశ్వర్ తన శరీరాన్ని పూర్తిగా మార్చుకున్నాడు. ఆసక్తికరమైన విషయమేమిటంటే, అతడి బరువులో పెద్దగా మార్పు రాలేదు. అప్పుడు, ఇప్పుడు కూడా భువీ బరువు సుమారు 7374 కిలోలే. కానీ, అసలు మార్పంతా శరీరంలోని కొవ్వు, కండరాల నిష్పత్తిలోనే ఉంది. మూడేళ్ల క్రితం భువీ శరీరంలో కొవ్వు శాతం (బాడీ ఫ్యాట్) దాదాపు 20 శాతం ఉండగా, కఠోర శ్రమతో దాన్ని 1314 శాతానికి తగ్గించుకున్నాడు. అంటే, కొవ్వును కరిగించి, ఆ స్థానంలో కండరాల బలాన్ని పెంచుకున్నాడు. ఇది ఫాస్ట్ బౌలర్‌కు అత్యంత కీలకం. గతంలో వెన్ను, చీలమండ, మోకాలి గాయాలతో ఇబ్బందిపడిన భువనేశ్వర్‌కు బరువులు ఎత్తే శిక్షణ అంటే కాస్త భయం ఉండేది. అయితే, ట్రైనర్ సూర్య యాదవ్ అతడిని నెమ్మదిగా ప్రోగ్రెసివ్ రెసిస్టెన్స్ ట్రైనింగ్‌కు అలవాటు చేశాడు. ఫలితంగా, ఒకప్పుడు స్క్వాట్స్‌లో కేవలం 40 కిలోల బరువును కష్టంగా ఎత్తిన భువీ, ఇప్పుడు ఏకంగా 110120 కిలోల బరువును సునాయాసంగా ఎత్తే స్థాయికి చేరుకున్నాడు. ఇది అతడి కాళ్లలో పెరిగిన బలానికి నిదర్శనం. భువనేశ్వర్ శిక్షణ కేవలం జిమ్‌కే పరిమితం కాలేదు. వారంలో 56 రోజులు, రోజుకు 5 నుంచి 7 గంటల పాటు కఠినమైన ప్రణాళికను అనుసరించాడు. ఇందులో హెవీ స్ట్రెంగ్త్ ట్రైనింగ్, ఒలింపిక్ లిఫ్ట్స్, పేలుడు శక్తిని పెంచే ప్లయోమెట్రిక్స్, జంపింగ్ డ్రిల్స్, బౌలింగ్ ప్రాక్టీస్, గాయాల నివారణకు సంబంధించిన వ్యాయామాలు ఉండేవి. ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం.. ఫాస్ట్ బౌలింగ్ సమయంలో శరీరంపై పడే తీవ్రమైన ఒత్తిడిని తట్టుకునేలా శరీరాన్ని బలోపేతం చేయడమే. ముఖ్యంగా వెన్నుపై భారం తగ్గించి, తన సహజమైన స్వింగ్, బ్యాక్‌స్పిన్‌ను కాపాడుకునేలా బౌలింగ్ మెకానిక్స్‌ను మెరుగుపరిచాడు. ఈ అంకితభావం, కఠోర శ్రమ ఫలితమే ఐపీఎల్ 2026లో కనిపించింది. నిలకడైన వేగంతో, అద్భుతమైన స్వింగ్‌తో ప్రత్యర్థులను ముప్పుతిప్పలు పెట్టి, తన కెరీర్‌కు కొత్త ఊపిరి పోసుకున్నాడు. త్వరలో జరిగే న్యూజిలాండ్ టూర్లోనూ సత్తా చాటేందుకు తహతహలాడుతున్నాడు. భువనేశ్వర్ పరివర్తన ఎందరో యువ అథ్లెట్లకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

## కోహ్లీ అంటేనే నానా పటేకర్‌కు ఎంత అభిమానమో..

- **వైరల్ అవుతున్న పాత వీడియో!**



ప్రముఖ నటుడు నానా పటేకర్ మరణంతో సినీ అభిమానులు విషాదంలో మునిగిపోయారు. ఈ సమయంలో ఆయనకు భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై ఉన్న అభిమానం తెలిపే పాత వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విరాట్ త్వరగా ఔటైతే తనకు భోజనం చేయాలనిపించదని నానా పటేకర్ ఆ వీడియోలో చెప్పడం అభిమానులను ఆకట్టుకుంటోంది. వైరల్ అవుతున్న వీడియోలో నానా పటేకర్ మాట్లాడుతూ.. ''విరాట్ అంటే నాకు చాలా ఇష్టం. అతడు ఒక అద్భుతమైన ఆటగాడు. విరాట్ త్వరగా ఔటైతే నాకు భోజనం చేయాలనిపించదు'' అని చెప్పినట్లు కనిపిస్తోంది. దీంతో క్రికెట్‌పై, ముఖ్యంగా విరాట్ కోహ్లీపై ఆయనకు ఉన్న అభిమానం ఎంతలా ఉందో అభిమానులు గుర్తు చేసుకుంటున్నారు. నానా పటేకర్ మృతిపై పలువురు మాజీ క్రికెటర్లు సంతాపం వ్యక్తం చేశారు. మాజీ భారత క్రికెటర్ శిఖర్ ధావన్ ఆయనను ప్రత్యేక ప్రతిభ ఉన్న నటుడిగా అభివర్ణించారు. నానా పటేకర్ చేసిన పనులు ఎన్నో తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొంటూ సోషల్ మీడియాలో నివాళులు అర్పించారు. మాజీ భారత బ్యాటర్ అజింక్య రహానే కూడా నానా పటేకర్ మృతిపై విచారం వ్యక్తం చేశారు. ఆయన అద్భుతమైన నటుడని, ఎన్నో తరాలను తన నటనతో అలరించారని గుర్తు చేసుకున్నారు. 1978లో వచ్చిన 'గమన్' సినిమాతో నటుడిగా నానా పటేకర్ కెరీర్ ప్రారంభమైంది. 'పరిందా', 'అగ్నిసాక్షి' వంటి సినిమాల్లో ప్రతినాయక పాత్రలతో ఆకట్టుకున్న ఆయన.. 'వెల్‌కమ్'లో తన కామెడీ టైమింగ్‌తోనూ ప్రేక్షకులను అలరించారు. ఇటీవలి కాలంలోనూ నానా పటేకర్ పలు సినిమాల్లో కనిపించారు. 'హౌస్‌ఫుల్ 5'లో నటించిన ఆయన.. షాహిద్ కపూర్, తృప్తి డిమ్రీ ప్రధాన పాత్రల్లో నటించిన 'ఓ'రోమియో'లో పోలీస్ అధికారిగా కనిపించారు. అనిల్ కపూర్, రాధికా మదన్ నటించిన 'సుబేదార్'లోనూ అతిథి పాత్రలో కనిపించారు.

## వైభవ్ విషయంలో తొందరొద్దు..
## వినోద్ కాంబ్లీని గుర్తుచేసిన కపిల్ దేవ్!

టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై వస్తున్న ప్రశంసల నేపథ్యంలో భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. అద్భుత ప్రతిభ ఉన్నప్పటికీ, అతని కెరీర్‌పై ఇప్పుడే భారీ అంచనాలు పెట్టుకోవడం తొందరపాటు అవుతుందని హెచ్చరించాడు. ప్రతిభ ఒక్కటే సుదీర్ఘ కెరీర్‌కు గీటురాయి కాదని చెబుతూ, మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ ఉదంతాన్ని ఉదాహరణగా చూపించాడు. ఈ విషయంపై కపిల్ దేవ్ మాట్లాడుతూ... "ఇప్పుడే అతని గురించి మాట్లాడటం తొందరపాటు అవుతుంది. అతనికి సామర్థ్యం ఉందా? అంటే.. కచ్చితంగా ఉంది. కానీ క్రికెట్‌లో ఎంతో మంది అపారమైన ప్రతిభతో అరంగేట్రం చేసి, ఆ తర్వాత కనుమరుగైపోయారు" అని అన్నాడు. "వినోద్ కాంబ్లీని చూడండి. దాని గురించి మనం ఏం చెప్పగలం?" అని ప్రశ్నించాడు. "వైభవ్‌కు ఇప్పుడు 15 ఏళ్లు. అతనికి మరో మూడేళ్ల సమయం ఇవ్వండి, ఆ తర్వాత మనం మాట్లాడదాం. అప్పటికి అతని జీవనశైలి, ఆలోచనా విధానం ఎలా మారతాయో చూడాలి. ప్రస్తుత ప్రదర్శన కంటే రాబోయే రెండేళ్లలో అతను తనను తాను ఎలా మలచుకుంటాడనేది చాలా ముఖ్యం" అని కపిల్ వివరించాడు. ఐపీఎల్ 2026లో 776 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ గెలవడం, అండర్19 ప్రపంచకప్ ఫైనల్‌లో 80 బంతుల్లోనే అజేయంగా 175 పరుగులు చేయడం వంటి అద్భుత ప్రదర్శనలతో వైభవ్ సూర్యవంశీ అందరి దృష్టిని ఆకర్షించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో యువ ఆటగాడిపై మితిమీరిన అంచనాలు వద్దని కపిల్ దేవ్ స్పష్టం చేశారు.

## పంజాబ్ కింగ్స్ కు డబుల్ షాక్..
## ఇద్దరు కీలక కోచ్‌లు గుడ్‌బై

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు ఫాస్ట్ బౌలింగ్ కోచ్ జేమ్స్ హోప్స్, ఫీల్డింగ్ కోచ్ బ్రాడ్ హాడిన్ తమ పదవుల నుంచి తప్పుకున్నారు. ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్‌లో కీలక బాధ్యతలు చేపట్టాల్సి రావడంతో వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. వీరి నిష్క్రమణతో హెడ్ కోచ్ రికీ పాంటింగ్ నేతృత్వంలోని కోచింగ్ బృందంలో పెద్ద లోటు ఏర్పడింది. జేమ్స్ హోప్స్ క్వీన్స్‌లాండ్, బ్రిస్బేన్ హీట్ జట్లకు హెడ్ కోచ్‌గా నియమితుడు కాగా, బ్రాడ్ హాడిన్ న్యూ సౌత్ వేల్స్ జట్టుకు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఇదివరకే పంజాబ్ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా ఉన్న సైరాజ్ బహుతులే భారత జట్టు కోచింగ్ సిబ్బందిలో చేరగా, ఇప్పుడు మరో ఇద్దరు కీలక సభ్యులు దూరం కావడం పంజాబ్ యాజమాన్యానికి కొత్త సవాలుగా మారింది. హోప్స్ గత రెండు సీజన్లుగా పంజాబ్ జట్టుతో కొనసాగుతున్నాడు. గతంలో అతడు పాంటింగ్ నేతృత్వంలోని ఢిల్లీ క్యాపిటల్స్ బృందంలోనూ పనిచేశాడు. బ్రాడ్ హాడిన్ 2022 నుంచి పంజాబ్ కోచింగ్ సిబ్బందిలో సభ్యుడిగా ఉన్నాడు. ప్రస్తుతం వీరిద్దరూ ఆస్ట్రేలియాలో జరుగుతున్న షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో తమ కొత్త బాధ్యతలను నిర్వహిస్తున్నారు. రికీ పాంటింగ్ 2025 సీజన్ కోసం పంజాబ్ జట్టుకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. గత సీజన్ (2026)లో పంజాబ్ జట్టు అద్భుతమైన ఆరంభాన్ని అందుకుని, వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. అయితే ఆ తర్వాత అనూహ్యంగా తడబడటంతో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయింది. ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఐపీఎల్ టైటిల్ గెలవని పంజాబ్, 2014, 2025 సీజన్లలో ఫైనల్‌కు చేరినప్పటికీ రన్నరప్‌గానే మిగిలిపోయింది.



## నా ఇంటర్వ్యూకు గంగూలీ హాజరు కాకపోవడం తీవ్రంగా బాధించింది

తనను భారత క్రికెట్ జట్టుకు డైరక్టర్‌గా తప్పించడం సరిగా అనిపించలేదని రవిశాస్త్రి తెలిపారు. 2016లో తనను కాదని అనిల్ కుంబ్లేను ప్రధాన కోచ్‌గా నియమించారని.. తన ఇంటర్వ్యూకు గంగూలీ హాజరు కాకపోవడం మరింత బాధించిందని గుర్తు చేసుకున్నారు. 2014లో టీమ్‌ఇండియాకు రవిశాస్త్రి డైరక్టర్ ఆఫ్ క్రికెట్ పదవిలో ఉన్నారు. రెండేళ్ల తర్వాత ఆ పదవిని బీసీసీఐ తీసేసింది. ప్రధాన కోచ్ పదవికి దరఖాస్తు చేయాలని రవిశాస్త్రికి సూచించింది. సౌరభ్ గంగూలీ, సచిన్ తెందుల్కర్, వీవీఎస్ లక్ష్మణ్‌తో కూడిన క్రికెట్ సలహా మండలి చివరి క్షణంలో రవిశాస్త్రిని కాదని కుంబ్లేను ఎంపిక చేసింది. ''నేను డైరక్టర్‌గా ఉన్నా. రెండేళ్ల తర్వాత బోర్డు సభ్యులు వచ్చి ఆ పదవిని రద్దు చేస్తున్నాం.. హెడ్ కోచ్ పదవికి దరఖాస్తు చేయమని చెప్పింది. నన్ను బయటకు పంపించేందుకు మరో కారణం ఉందని అనిపించింది. ఆ నిర్ణయం నన్ను చాలా బాధించింది. జట్టు కోసం నా శాయశక్తులా కృషి చేశా. నన్ను ఇంటర్వ్యూ చేసేందుకూ గంగూలీ గైర్హాజరు కావడం మరింత బాధపెట్టింది'' అని రవిశాస్త్రి తెలిపారు.

''నా వ్యాఖ్యాత పాత్రను పోషించేందుకు వెళ్లిపోయా. ఆటతోనే మమేకమై ఉన్నా. దాదాపు ఏడాదిన్నరపాటు మంచి అనుభవం సంపాదించా. ఎన్నో పాఠాలను నేర్చుకున్నా. ప్రధాన కోచ్‌గా భారత డ్రెస్సింగ్ రూమ్‌లోకి వచ్చా. ఆటగాళ్లు ఎలా ఆలోచిస్తున్నారనేది అర్థం చేసుకున్నా. జీవితంలో ఇలాంటి ఒడుదొడుకులు సహజమే. వాటన్నింటినీ ఎదుర్కొని ముందుకు సాగా. అవకాశం అందిపుచ్చుకున్నా'' అని రవిశాస్త్రి తెలిపారు.

## చిరంజీవి-శ్రీకాంత్ ఓదెల ప్రాజెక్ట్

# అటకెక్కినట్టేనా?

### 'ది ప్యారడైజ్' ఫలితం తర్వాత మారిన సమీకరణాలు

మెగాస్టార్ చిరంజీవి-'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో ప్రకటించిన క్రేజీ ప్రాజెక్ట్‌పై ఇప్పుడు సందేహాలు నెలకొన్నాయి. నేచురల్ స్టార్ నాని నిర్మాతగా ఈ చిత్రాన్ని ప్రకటించినప్పుడు భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే ప్రస్తుతం ఈ సినిమా పట్టాలెక్కే అవకాశాలు కనిపించడం లేదనే ప్రచారం ఫిలింనగర్ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

చిరంజీవికి కథ చెప్పి శ్రీకాంత్ ఓదెల మెప్పించడంతో ఈ ప్రాజెక్ట్ అధికారికంగా ప్రకటించారు. 'బ్లడ్ ప్రామిస్' పేరుతో విడుదల చేసిన కాన్సెప్ట్ పోస్టర్ అప్పట్లో సంచలనం సృష్టించింది. అయితే నాని-శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వచ్చిన 'ది ప్యారడైజ్'పై ప్రేక్షకుల స్పందన ఈ ప్రాజెక్ట్‌పై ప్రభావం చూపిందనే చర్చ మొదలైంది. ముఖ్యంగా సినిమాలోని మితిమీరిన హింస, రక్తపాతం తీవ్ర విమర్శలకు దారితీసింది. భారీ అంచనాలతో వచ్చిన ఈ చిత్రం వాణిజ్యపరంగానూ ఆశించిన స్థాయిలో ఫలితాన్ని అందుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో తాజాగా నాని చేసిన వ్యాఖ్యలు ప్రాజెక్ట్ భవితవ్యంపై మరిన్ని అనుమానాలకు తావిస్తున్నాయి. 'ది ప్యారడైజ్' ఆలస్యం కాకపోయి ఉంటే చిరంజీవి-శ్రీకాంత్ ఓదెల చిత్రాన్ని ఈ ఏడాదే ప్రారంభించేవాళ్లమని, అయితే సినిమా ఆలస్యం కావడంతో చిరంజీవి ఇతర చిత్రాలకు కట్టుబడాల్సి వచ్చిందని నాని చెప్పినట్లు సమాచారం. దీంతో ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతానికి పక్కన పడినట్టేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అయితే పరిశ్రమ వర్గాల్లో మాత్రం దీనిపై మరో రకమైన చర్చ నడుస్తోంది. 'ది ప్యారడైజ్'లో కనిపించిన హింస, సినిమాకు వచ్చిన స్పందన నేపథ్యంలో చిరంజీవి ఈ కథ విషయంలో పునరాలోచన చేస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. వింటేజ్ మాస్ ఇమేజ్ ఉన్న చిరంజీవితో శ్రీకాంత్ ఎలాంటి కథను తెరకెక్కించబోతున్నారన్న విషయంలో ఇప్పటికే మెగా అభిమానుల్లో ఆసక్తితో పాటు ఆందోళన కూడా వ్యక్తమైంది.

ప్రస్తుతం చిరంజీవి ఇతర చిత్రాలకు కమిట్ కావడం, ఈ ప్రాజెక్ట్‌పై ఎలాంటి కొత్త ప్రకటన రాకపోవడంతో సినిమా పూర్తిగా ఆగిపోయిందా? లేక కొంతకాలం తర్వాత మళ్లీ పట్టాలెక్కుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు ఈ ప్రాజెక్ట్ కోసం దర్శకుడిని నమ్మిన నాని.. భవిష్యత్తులో శ్రీకాంత్ ఓదెలతో మరో చిత్రాన్ని చేస్తారా? అన్నదీ ఇప్పుడు టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది.





## కార్గిల్ వార్‌లో నానా పటేకర్..

# అల్విదా నానా భాయ్!

కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు.. క్షణం తీరిక లేకుండా బిజీగా ఉన్నప్పుడు.. రెండు చేతులా సంపాదిస్తున్నప్పుడు.. ఎవరైనా బ్రేక్ తీసుకుంటారా..? అది ఎలాంటి కెరీర్ అయినా సరే దాన్ని వదులుకుంటారా..? దేశం కోసం అలా కెరీర్‌కి బ్రేక్ ఇచ్చిన ఓ వ్యక్తి ఉన్నారు.. ఆయనే నానా పటేకర్. సినిమాల్లో పాత్రల ద్వారా అద్భుతమైన నట విన్యాసాలను ప్రదర్శించడమే కాదు.. అవసరమైనప్పుడు దేశం కోసం శత్రువులతో పోరాడిన వీరుడు నానా పటేకర్. అది 1999వ సంవత్సరం.. దేశాన్ని మన శత్రువులు చుట్టుముట్టిన కాలం.. కార్గిల్ యుద్ధం హోరాహోరీగా సాగుతున్న సమయం.. యావత్ దేశం సైన్యం పక్షాన నిలడిన సందర్భం. ఇండో పాక్ సరిహద్దుల్లో కార్గిల్ వద్ద సాగుతున్న యుద్ధానికి సంబంధించిన వార్తలను తెలుసుకుంటూ దేశ ప్రజలందరూ పాక్ ఓటమి కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న సమయంలో... నానాపటేకర్ మాత్రం భిన్నంగా స్పందించారు. బిజీ సినిమా షెడ్యూల్ ను పక్కన పెట్టి సరిహద్దుల్లోకి వెళ్లి పోరాడాలని నిర్ణయించుకున్నారు.

1980ల చివర్లో నానా పటేకర్ టెరిటోరియల్ ఆర్మీలో అధికారికంగా చేరారు. 1991లో వచ్చిన 'ప్రహార్ ది ఫైనల్ ఎటాక్' సినిమాలో ఆర్మీ కమాండో పాత్ర కోసం ఆయన షార్ట్‌కట్స్ వాడకుండా ఏకంగా మూడేళ్ల పాటు శిక్షణ తీసుకున్నారు. మరాఠా లైట్ ఇన్ఫాంట్రీతో కలిసి తీసుకున్న శిక్షణ ఆయనను ఆర్మీకి మరింత దగ్గర చేసింది. అందుకే కార్గిల్ యుద్ధ సమయంలో తనకు దేశానికి సేవ చేసే అవకాశం ఇవ్వాలని టెరిటోరియల్ ఆర్మీలో సీనియర్ అధికారులకు రిక్వెస్ట్ పెట్టుకున్నారు. అయితే ఆ అధికారం తమకు లేదని... రక్షణ మంత్రి మాత్రమే నిర్ణయం తీసుకోగలరని వారు స్పష్టం చేశారు.

పై అధికారుల నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోయినా... ఏ మాత్రం నిరాశ చెందని నానా పటేకర్... అప్పటి రక్షణ మంత్రి జార్జ్ ఫెర్నాండెజ్‌ను కలిసి.. తనకు ముందుండి పోరాడేందుకు అనుమతించాలని అభ్యర్థించారు. షూటింగ్ నైపుణ్యాలు, గెలుచుకున్న పతకం గురించి మంత్రికి వివరించారు. అనుమతి లభించిన వెంటనే తన సినిమా కెరీర్‌ను పక్కనపెట్టి ఆర్మీకి చెందిన క్విక్ రియాక్షన్ టీమ్ లో చేరారు. శ్రీనగర్, ద్రాస్, లేహ్ ప్రాంతాల్లో ఆర్మీతో కలిసి 60 రోజులు ఉన్నారు. బాలీవుడ్ సెలబ్రిటీని అన్న విషయాన్ని పక్కనపెట్టి... సైనికులతో కలిసి శత్రువులతో పోరాడారు. బోర్డర్ లో ఉన్న సమయంలో ఆయన సుమారు 20 కేజీల బరువు కూడా తగ్గారు. ఇండియన్ సిల్వర్ స్క్రీన్ పై ఎంతో మంది నటీనటులు తమ ప్రతిభను ప్రదర్శించారు. కానీ నానాపటేకర్ లాంటి మానవత్వం ఉన్న నటులు మాత్రం చాలా అరుదుగానే ఉంటారు. నాటకాలతో పాటు మరాఠీ, హిందీ సినిమాల్లో అద్భుతమైన నటన కనబరిచిన నానా పటేకర్ చాలా క్రమశిక్షణతో ఉండేవారు. ఏ పాత్రనైనా అవలీలగా చేయగల అరుదైన నటుల్లో ఆయన పేరు ముందు వరుసలో ఉంటుంది. అల్విదా నానా భాయ్.



## ప్రభాస్ ఫ్యాన్స్‌కు

# డబుల్ ట్రీట్..

### పుట్టినరోజున 'ఫౌజీ', 'స్పిరిట్' నుంచి అదిరిపోయే అప్‌డేట్స్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రాల్లో 'ఫౌజీ' ఒకటి. 'సీతారామం' ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 1940ల స్వాతంత్ర్య పూర్వ కాలం నేపథ్యంలో రూపొందుతోంది. ఇమాన్వి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నిర్మాతలు రవిశంకర్, నవీన్ యెర్నేని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు గతంలో ప్రకటించిన చిత్రబృందం.. తాజాగా విడుదలను వాయిదా వేసినట్లు స్పష్టం చేసింది. దీంతో ప్రభాస్ అభిమానులు కాస్త నిరాశకు గురయ్యారు. అయితే వారికి ఉత్సాహాన్నిచ్చేలా తాజాగా ఓ ఆసక్తికరమైన సమాచారం సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ప్రభాస్ పుట్టినరోజైన అక్టోబర్ 23న 'ఫౌజీ' నుంచి ప్రత్యేక మెరుపు దృశ్యాలను విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతున్నట్లు సమాచారం. విడుదల తేదీ వాయిదా పడిన నేపథ్యంలో అభిమానులకు ఇది ప్రత్యేక కానుకగా నిలవనుందని తెలుస్తోంది. అదే రోజు ప్రభాస్, సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందుతున్న 'స్పిరిట్' నుంచి కూడా అధికారిక పోస్టర్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఒకే రోజున ప్రభాస్ నటిస్తున్న రెండు భారీ చిత్రాల నుంచి అప్‌డేట్స్ రానుండటంతో అభిమానుల్లో ఇప్పటి నుంచే ఆసక్తి నెలకొంది. ఈ రెండు అప్‌డేట్స్‌తో ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు మరింత గ్రాండ్‌గా మారనున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి.



# పవన్ కల్యాణ్ అంటే చిన్నప్పటి నుంచే ఇష్టం: ఆనంది



తెలుగు, తమిళ చిత్రాల్లో విభిన్న పాత్రలు చేస్తూ గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ ఆనంది.. తన అభిమాన హీరో పవన్ కల్యాణ్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన కొత్త సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మీడియాతో మాట్లాడిన ఆమె.. తనకు నచ్చిన హీరో ఎవరనే ప్రశ్నకు సమాధానమిచ్చారు. తాను పవన్ కల్యాణ్‌కు వీరాభిమానినని ఆనంది తెలిపారు. చిన్నతనం నుంచే ఆయనపై క్రష్ ఉండేదని చెప్పారు. తెరపై పవన్ కల్యాణ్ చూపించే మ్యానరిజమ్స్, ప్రత్యేకమైన స్టైల్ తనను ఎంతగానో ఆకట్టుకుంటాయని పేర్కొన్నారు. ఆయన సినిమా విడు దలవుతుందంటే తనకు పండగలా అనిపిస్తుందని తెలిపారు. నటిగా మారిన తర్వాత కూడా పవన్ కల్యాణ్‌పై తనకున్న అభిమానం ఏమాత్రం తగ్గలేదని ఆనంది వెల్లడించారు.



బాలీవుడ్‌లో గ్లామర్ పాత్రలతో ఎక్కువగా కనిపించిన దిశా పటాని.. ఇకపై తన కెరీర్‌లో విభిన్నమైన పాత్రలకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలిపారు. 'ఎంఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ'తో సినీ ప్రేక్షకులకు పరిచయమైన ఆమె.. ఆ చిత్రానికి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా తన సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ పదేళ్లలో నటిగా ఎన్నో అనుభవాలు

## నటిగా ఆ ఒక్కదానికే పరిమితం కాను: దిశా పటాని

తనను మరింత పరిణతి చెందిన నటిగా తీర్చిదిద్దాయని దిశా పటాని పేర్కొన్నారు. ఇప్పటివరకు గ్లామర్‌కు ప్రాధాన్యమున్న పాత్రలు ఎక్కువగా చేశానని, ఇకపై కొత్త తరహా కథలు, పాత్రలతో ప్రయోగాలు చేయాలని ఉందన్నారు. కేవలం తెరపై అందంగా కనిపించడం కాకుండా.. కథలో కీలకంగా నిలిచే పాత్రలు పోషించి నటిగా తన సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా తనలోని నటనను బయటపెట్టే అవకాశాల కోసం ఎదురుచూస్తున్నట్లు దిశా పటాని తెలిపారు.

Printed, Published and Owned by MOHAMMAD ABDUL RAHEMAN, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273 Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717

# ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం

**ఆదిలాబాద్ లో భారీ నిరసన**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఓటరు సవరణ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఇచ్చిన 'సేవ్ డెమోక్రసీ' పిలుపులో భాగంగా రాహుల్ గాంధీకి మద్దతుగా జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షులు సాజిద్ ఖాన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి, రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ, కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల కమిషనర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ చౌక్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉండేలా పారదర్శకతను నిర్ధారించాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందన్నారు. "ఓట్ చోరీ" ఆరోపణలపై సమగ్రంగా సమాధానాలు ఇవ్వాలని, ఎన్నికల సంఘం విశ్వసనీయతను కాపాడేందుకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్, జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజేషన్ ఇంచార్జ్ బెజ్జంకి అనిల్ కుమార్, కార్యాలయ ఇంచార్జ్ గౌలి సంజీవ్ కుమార్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ బండారి సతీష్, మహిళా విభాగం అధ్యక్షురాలు అన్నపూర్ణ, ఎస్సీ విభాగం అధ్యక్షులు పరమేశ్వర్, మైనారిటీ విభాగం అధ్యక్షులు సయ్యద్ షాహిద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు జిశాన్, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ గౌడ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు మోతిరాం, జనరల్ సెక్రటరీలు బండి దేవదాస్ చారి, అత్తర్ అలీ, మందాకిని, కాడే సంతోష్, సెక్రటరీ సిరాజుద్దీన్, మీడియా కోఆర్డినేటర్ మేకల జితేందర్, మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, మావల మండల అధ్యక్షులు కుదురుపాక సురేష్, మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆటో యూనియన్ నూతన ధరల పట్టిక ఆవిష్కరణ

**నేటి నుంచి కొత్త ఛార్జీలు అమలు**

**ఉద్యమ కెరటం, తాండూర్:** పెరిగిన నిత్యావసర ధరలు, డీజిల్, గ్యాస్ ధరలను దృష్టిలో ఉంచుకుని తాండూర్ మండల ఆటో యూనియన్ నూతన ఛార్జీలను నిర్ణయించింది. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని ఐబీలో యూనియన్ నాయకులు, ఆటో కార్మికులు, ప్రజల సమక్షంలో ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ సాలిగామ బానయ్య నూతన ధరల పట్టికను ఆవిష్కరించారు. కొత్త ధరలు గురువారం నుంచే అమల్లోకి వస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు సౌకర్యం కారణంగా ఆటో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెరిగిన ఇంధన ధరలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయించిన ఛార్జీలు న్యాయబద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. కనీస ఛార్జీ రూ.20, ఎంవీకే-3కు రూ.30, బెల్లంపల్లికి రూ.30, మంచిర్యాలకు రూ.70గా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆటో కార్మికులకు సహకరించాలని కోరారు. ఆటో కార్మికులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, తమ కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలు, ఇన్సూరెన్స్, జీవిత బీమా తదితరాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. నూతన ఛార్జీలపై నిర్ణయం తీసుకునే ముందు బుధవారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సంపూర్ణ బంద్ నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ పాషా, ఉపాధ్యక్షుడు చాంద్ ఖాన్, కోశాధికారులు రఫీ ఖాన్, అభి, మండల సలహాదారు విద్యాసాగర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు రేగుల



రవి, ఆశుమ్ అలీ, సంయుక్త కార్యదర్శి పల్లె వెంకటేష్, గుమ్మడి పోషమల్లు, దండుగుల రమేష్, త్రిబుల్ ఆర్ రియాజ్, ఫయీమ్, డోలి శ్రీనివాస్, జిమిక్స్ రవి, శశి ఠాగూర్, కన్నయ్య, భీమ్రావు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీల స్మశానవాటికకు మహర్దశ

- **ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న విద్యుత్ సమస్యకు పరిష్కారం**

**ఉద్యమ కెరటం, హత్నూర:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండల కేంద్రంలోని మైనార్టీల స్మశానవాటికకు ఎట్టకేలకు విద్యుత్ వెలుగులు రానున్నాయి. చాలాకాలంగా పెండింగ్లో ఉన్న విద్యుత్ సౌకర్యం సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానిక మైనార్టీ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన స్తంభాలు, తీగలు, ట్రాన్స్ఫార్మర్కు సంబంధించిన వైర్లను మంజూరు చేసినట్లు మైనార్టీ నాయకులు తెలిపారు. మైనార్టీ యువకుల విజ్ఞప్తి మేరకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించి అవసరమైన సామగ్రిని మంజూరు చేశారని పేర్కొన్నారు. స్మశానవాటికకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు చాలా కాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. త్వరలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ఇతర పనులు పూర్తిచేసి వెలుగులు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్రెడ్డి ఆదేశాలు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజారెడ్డి సహకారం, మాజీ సర్పంచ్ వీరస్వామి గౌడ్ కృషి కారణమని పేర్కొన్నారు. మాజీ ఏఈ విజయ్కుమార్, ప్రస్తుత ఏఈ రాఘవ, లక్ష్మీకాంత్రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆసీఫ్, ధనుంజయ్, మాజీ వార్డు సభ్యుడు ఖదీర్, మత పెద్ద ముఫ్తి అబ్దుల్ బారి, సీనియర్ నాయకులు ఇస్మాయిల్, అబ్దుల్ ఖదీర్, అజ్జు, ఆసీఫ్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బెజ్జూర్లో ఘోర రోడ్డు ప్రమాదం.. ఒకరు మృతి

- **మలుపు వద్ద బైక్ అదుపుతప్పి ఘటన**

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన బెజ్జూర్ మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. రేచిని గ్రామానికి చెందిన నికురి అనంతరావు, నికురి మల్లయ్య, నికురి రాజయ్య ముగ్గురు ఒకే ద్విచక్ర వాహనంపై కాగజ్నగర్ నుంచి స్వగ్రామానికి వస్తుండగా, సలగుపల్లి మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా, నికురి రాజయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరావు పరిస్థితి విషమంగా ఉండగా, మల్లయ్య కుడి చేయి విరిగినట్లు సమాచారం. క్షతగాత్రులను బెజ్జూర్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం





కుటుంబ సభ్యులు 108 వాహనంలో కాగజ్నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న బెజ్జూర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మితిమీరిన వేగంతో పాటు మూలమలుపు వద్ద రహదారి సరిగా లేకపోవడం ప్రమాదానికి కారణమై ఉండొచ్చని స్థానికులు తెలిపారు.

# డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- **సంప్రదాయ దుస్తుల్లో అలరించిన విద్యార్థినులు**

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కాగజ్నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, మహిళా సాధికారత సెల్ సమన్వయంతో గురువారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి మాట్లాడుతూ తరతరాలుగా కొనసాగుతున్న బతుకమ్మ పండుగ




సాంప్రదాయాలు తెలంగాణ సంస్కృతిలో అంతర్భాగమని అన్నారు. వాటిని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసింహం బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని, తెలంగాణ సంస్కృతిలో దాని విశిష్టతను వివరించారు. కళాశాల కోఆర్డినేటర్ దుర్గం జనార్దన్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ప్రతిఒక్కరి జీవితాల్లో ఆనందం, సంతోషం నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తూదూరు దత్తాత్రేయ, మహిళా సాధికారత విభాగం ఇన్చార్జి రోజ్ మేరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తుల్లో హాజరై అందంగా బతుకమ్మలను అలంకరించి, బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# విద్యా భారతి సంస్థకు జాతీయ స్థాయి అవార్డు




**ఉద్యమ కెరటం, తాండూర్:** హైదరాబాద్ లో జరిగిన సౌత్ ఇండియా ఎడ్యుకేషన్ సమ్మిట్-2026లో తమ సంస్థ విద్యా భారతి హైస్కూల్ కు జాతీయ స్థాయిలో డైనమిక్ స్కూల్ అవార్డు లభించిందని పాఠశాల డైరెక్టర్ సురభి శరత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బోధన అంశాల్లో విభిన్నత అంశంలో పాఠశాలకు ఈ అవార్డు లభించినట్లు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో జి న్యూస్ నెట్ వర్క్ సీఈఓ అనిల్ శర్మ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం సంస్థ పనితీరుకు గర్వకారణమని అన్నారు. అవార్డు ప్రదానంలో అకాడమిక్ డైరెక్టర్ సురభి సౌమ్య రావు పాల్గొన్నారు. సంస్థ చైర్మన్ సురభి ఆగమారావు సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది అంకితభావంతో చేసిన కృషితో ఈ అవార్డు వచ్చిందని సిబ్బందిని అభినందించారు.

# నీలాయపల్లిలో దోమల మందు పిచికారీ




**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని నీలాయపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గురువారం వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించడంతో పాటు ఇంటింటికీ తిరిగి దోమల మందు పిచికారీ చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పోలవేణి తిరుపతి మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలే మన ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కువ రోజులు నిల్వ ఉన్న నీటిని తొలగించాలని సూచించారు. అపరిశుభ్రత, నిల్వ నీరు దోమల వృద్ధికి కారణమవుతాయని, వాటి ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని వివరించారు. జ్వరం వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుని సరైన చికిత్స పొందాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రంజిత్, ఏఎన్ఎం పద్మ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, బ్రీడింగ్ చెకర్ కిరణ్, ఆశా కార్యకర్త కవిత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నీట్ ఫలితాల్లో మెరిసిన ఉస్మాన్స్ కేరళ గ్రామర్ పాఠశాల పూర్వ విద్యార్థి

**ఎంబీబీఎస్ సీటు సాధించిన చోలే నరేష్కు ఘన సన్మానం**



**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ మండల కేంద్రంలోని ఉస్మాన్స్ కేరళ గ్రామర్ స్కూల్ పూర్వ విద్యార్థి చోలే నరేష్ ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి ఎంబీబీఎస్ సీటు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ షేక్ జమీల్, ఉపాధ్యాయులు గురువారం నరేష్ను అభినందించారు. ఆయన సాధించిన విజయాన్ని పురస్కరించుకుని పాఠశాల యాజమాన్యం ఆయనతో పాటు తండ్రి చోలే మహాదేవ్ను శాలువాలతో ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ మాట్లాడుతూ భవిష్యత్తులో వైద్య రంగంలో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల పూర్వ విద్యార్థి ఎంబీబీఎస్ సీటు సాధించడం తమకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. నరేష్ పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగడం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. భవిష్యత్తులో వైద్యుడిగా రాణించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శుక్రవారం
9 అక్టోబర్ 2026

# టీబీ ముక్త్ భారత్ అభియాన్ అవార్డు అందుకున్న పవర్గూడ

## జైనూర్ మండలానికి అరుదైన గుర్తింపు



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని పవర్గూడ గ్రామపంచాయతీకి టీబీ ముక్త్ భారత్ అభియాన్ అవార్డు లభించింది. క్షయవ్యాధి (టీబీ) నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన కార్యక్రమాల్లో గ్రామపంచాయతీ చేసిన కృషికి ఈ గుర్తింపు లభించింది. అవార్డు రావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పవర్గూడ సర్పంచ్ తొడసం రాజేందర్ అవార్డును అందుకున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలోని 360 గ్రామపంచాయతీల్లో, జైనూర్ మండలంలోని 26 గ్రామపంచాయతీల్లో పవర్గూడకు ఈ అవార్డు దక్కడం విశేషంగా నిలిచింది. ప్రజారోగ్య పరిరక్షణతో పాటు టీబీ నిర్మూలనపై గ్రామస్థులకు అవగాహన కల్పించేందుకు చేపట్టిన కార్యక్రమాలకు ఈ అవార్డు గుర్తింపుగా నిలిచింది. ఈ సందర్భంగా సర్పంచ్ తొడసం రాజేందర్ మాట్లాడుతూ గ్రామంలో టీబీ నిర్మూలనకు మరింత కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు టీబీ లక్షణాలు, చికిత్స, నివారణ చర్యలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైనూర్ ఎంపీడీఓ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి ఎం.కిషోర్, గ్రామపంచాయతీ ఏఎన్ఎం ఆత్రం సావిత్రిబాయి, ఆశా కార్యకర్త మిశ్రమ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రత, సౌకర్యమే లక్ష్యంగా చర్యలు

## కాగజ్నగర్ వార్డు 16లో నూతన స్ట్రీట్ లైట్లు



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** పట్టణంలోని 16వ వార్డులో కాలనీ ప్రజల సౌకర్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని నూతన స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేశారు. చైర్పర్సన్ షాహీన్ సుల్తానా సహకారంతో వార్డు కౌన్సిలర్ కచ్చకాయల జ్యోతి ఆధ్వర్యంలో అవసరమైన ప్రాంతాలను గుర్తించి గురువారం లైట్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ జ్యోతి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు వారి భద్రత, సౌకర్యం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

# సోషల్ మీడియా కోఆర్డినేటర్ సయ్యద్ సాబీర్కు సన్మానం



**ఉద్యమ కెరటం, జైనూర్:** కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్గా నియమితులైన సయ్యద్ సాబీర్తో పాటు నూతనంగా నియమితులైన మండల కార్యవర్గ సభ్యులను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. జైనూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ రషీద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమత విశ్వనాథరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సుద్దాల శ్రీనివాస్ తదితరులు వారికి శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మీడియా రంగానికి సాంకేతిక పరిజ్ఞానం అవసరం

- వాస్తవ, విశ్వసనీయ సమాచారమే జర్నలిస్టుల లక్ష్యం కావాలి
- తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** సమాజంలో నెలకొన్న ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రజలకు ఎప్పటికప్పుడు వాస్తవ, విశ్వసనీయ సమాచారాన్ని అందించడంలో మీడియా కీలకపాత్ర పోషిస్తుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మీడియా రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జర్నలిస్టులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని వృత్తి నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పర్చుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టీటీడీసీ హాల్లో విలేకరులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వార్తల సేకరణ, వాస్తవ నిర్ధారణ, విశ్లేషణ, రచన, ప్రసారం వంటి ప్రతి దశలో జర్నలిస్టులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా సమాచారం క్షణాల్లో విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ధ్రువీకరించని సమాచారాన్ని ప్రచారం చేయకుండా జాగ్రత్త వహించాలన్నారు. వార్తను వేగంగా అందించడం కంటే, వాస్తవాలను నిర్ధారించి బాధ్యతాయుతంగా ప్రజలకు అందించడం ముఖ్యమని స్పష్టం చేశారు. తప్పుడు వార్తలు, అసత్య ప్రచారాలకు తావులేకుండా ప్రజలకు సరైన సమాచారాన్ని అందించడమే పాత్రికేయుల ప్రధాన బాధ్యతగా ఉండాలన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్తంభంగా ప్రజల తరఫున గొంతుకగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సేవల తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంలో స్థానిక విలేకరుల పాత్ర అభినందనీయమన్నారు. వార్తలో వేగం కంటే వాస్తవికత, విశ్వసనీయత, బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. మారుతున్న మీడియా అవసరాలకు అనుగుణంగా జర్నలిస్టులకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించేందుకు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వాటి పరిష్కారానికి అకాడమీ తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండు రోజుల శిక్షణలో అనుభవజ్ఞులైన జర్నలిస్టులు, నిపుణులు వివిధ అంశాలపై అవగాహన కల్పించనున్నారని చెప్పారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని కొత్త విషయాలను నేర్చుకోవడంతో పాటు వృత్తి నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో సమాజ హితం కోసం నిరంతరం పనిచేసే జర్నలిస్టుల పాత్ర ఎంతో ప్రాధాన్యమైనదని అన్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంలో, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరుతున్న తీరును తెలియజేయడంలో మీడియా కీలకంగా వ్యవహరిస్తోందన్నారు. వాస్తవాలను ఆధారంగా చేసుకుని వార్తలను అందిస్తూ సమాజ అభివృద్ధికి జర్నలిస్టులు తమవంతు సహకారం అందించాలని కోరారు. రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో వార్తా సేకరణలో నూతన పద్ధతులు, వార్తల వాస్తవ నిర్ధారణ, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా వినియోగం, పాత్రికేయ నైతిక విలువలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, జర్నలిజంలో ఎదురవుతున్న సవాళ్లు తదితర అంశాలపై నిపుణులు విలేకరులకు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వేంకటేశ్వరరావు, ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి, డీపీఆర్వో విష్ణువర్ధన్, మీడియా అసోసియేషన్ ప్రతినిధులు రాజేశ్వర్, దేవేందర్, బేత రమేష్, సురేష్, సుభాష్, కిరణ్, పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



# గుడిహత్నూర్లో కాంగ్రెస్ శ్రేణుల భారీ నిరసన

- నల్ల రిబ్బన్లతో ప్రదర్శన.. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా టీపీసీసీ, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ ఆదేశాల మేరకు గుడిహత్నూర్ మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ శ్రేణులు నల్ల రిబ్బన్లు ధరించి భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తొడసం దౌలత్రావు, సర్పంచ్ ఆడే శీలా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తొడసం దౌలత్రావు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్న ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేసి, తొలగించిన ఓటర్ల పేర్లను వెంటనే ఓటరు జాబితాలో చేర్చాలని కోరారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. సర్పంచ్ ఆడే శీలా మాట్లాడుతూ రాజ్యాంగ విలువలు, ప్రజల హక్కులను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచి పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంబుగూడ సర్పంచ్ కాతలే భరత్, మాజీ జడ్పీటీసీ మస్కే మాధవ్, పెందుర్ జైరామ్, బాలాజీ పటేల్, మోహితే మారుతి, ఆడే జైపాల్, కాగ్నే రాంకిషన్, ఆరిఫ్ ఖాన్, కాంబ్లె శ్యామ్, మోతివార్ గణపతి, ససానే మాధవ్, రేచర్ల సత్యనారాయణ, శ్రీధర్ మహారాజ్, ముండే రవి, ఆడే క్రాంతికుమార్, దేవరావు, వధుమాల, పెందుర్ జీవన్, పవార్ రాంప్రకాష్, వెంకటి యాదవ్, షకీల్, ఆడే జైల్సింగ్, తొడసం శ్రీనివాస్, మల్లేష్, పరశురాం, సారంగపాణి, కుమ్మ మాధవ్, రమేష్తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# భారత ప్రజాస్వామ్యానికి నేడు బ్లాక్ డే

- బోథ్లో నల్ల బ్యాడ్జీలతో కాంగ్రెస్ శ్రేణుల నిరసన

**ఉద్యమ కెరటం, బోథ్:** ఏఐసీసీ, టీపీసీసీ, డీసీసీ పిలుపు మేరకు బోథ్ మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మేరుగు భోజన్న మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్యానికి నేడు బ్లాక్ డే అని పేర్కొన్నారు. ఓటు చోరీ విధానాలపై పోరాటం చేస్తున్న లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సీనియర్ నాయకులు, ఇండియా కూటమి ఎంపీలపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఖండించారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కుర్మే మహేందర్, డీసీసీ జనరల్ సెక్రటరీ వినయ్కుమార్ రెడ్డి, బోథ్ మండల జనరల్ సెక్రటరీ షేక్ అబూద్, పీఏసీ సభ్యులు వడ్లకొండ సురేందర్, రాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రీ-సర్వే పనులను వేగవంతం చేయాలి





## జిల్లా అదనపు కలెక్టర్ రాములు

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. గురువారం బెల్లంపల్లి మండలం చాకెపల్లి గ్రామంలో కొనసాగుతున్న రీ-సర్వే పనులను తహశీల్దార్ కృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ఎంపిక చేసిన గ్రామాల్లో రీ-సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రీ-సర్వే పనులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనసాగుతున్నాయని తెలిపారు. పనులను నిబంధనల ప్రకారం, ఖచ్చితత్వంతో, పారదర్శకంగా మరింత వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, సర్వేయర్ వసంతరావు, జిపిఓ శివకుమార్, చైన్మెన్ రమేష్, మాజీ ఎంపీటీసీ మహేందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పదవులు మరింత బాధ్యతను పెంచుతుంది





**• నూతన కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులకు సన్మానం**

**ఉద్యమ కెరటం, జైనూర్:** కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్త, నాయకుడికి గుర్తింపు లభిస్తుందని, పదవులు రావడంతో బాధ్యత మరింత పెరుగుతుందని కాంగ్రెస్ పార్టీ జైనూర్ మండల అధ్యక్షుడు షేక్ రషీద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమత విశ్వనాథరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సుద్దాల శ్రీనివాస్ అన్నారు. గురువారం జైనూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన వివిధ విభాగాల నాయకులను శాలువాలతో సన్మానించారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జిల్లా చైర్మన్ అర్షద్ హుస్సేన్ ప్రకటించిన మండల కాంగ్రెస్ కార్యవర్గంతో పాటు మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, కిసాన్ సెల్, మహిళా, యువజన, సేవాదళ్, మీడియా విభాగాల నూతన కార్యవర్గ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. మండల ఉపాధ్యక్షుడిగా కోట్నాక దౌలత్ రావు, ప్రధాన కార్యదర్శిగా కోటేష్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా కొమర భుజంగరావు, బీసీ సెల్ అధ్యక్షుడిగా దండవుల మహేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా భూతాలే కిరణ్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా దుర్వాసందు, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా మెస్రం జంగు, సేవాదళ్ అధ్యక్షుడిగా చవాన్ విక్రమ్, యువజన అధ్యక్షుడిగా కోవా సిద్దు, మీడియా కోఆర్డినేటర్గా సయ్యద్ సాబీర్ నియమితులయ్యారు. మైనార్టీ విభాగం మండల అధ్యక్షుడిగా షేక్ అబ్బు, ఉపాధ్యక్షులుగా షఫీక్ అన్సారి, సయ్యద్ సజ్జాద్ అలీ, స్పోక్స్ పర్సన్గా మజార్, ప్రధాన కార్యదర్శులుగా షేక్ షాకీర్, సయ్యద్ గులాబ్, షేక్ అబ్దుల్, షేక్ వసీం, షేక్ మహబూబ్, షేక్ రహీం, కార్యదర్శులుగా షేక్ తాజు, షేక్ అజీమ్, షేక్ చంద్, సయ్యద్ సాబీర్, షేక్ సమీర్, షేక్ ఖలీల్, షేక్ ఇసాక్, షేక్ సాహిల్, షేక్ ఇర్ఫాన్, షేక్ మసీద్ తదితరులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నూతన బాధ్యతలు చేపట్టిన వారు క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో చొరవ చూపాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక క్రమశిక్షణ, బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించేందుకు గురువారం ఆర్థిక అక్షరాస్యత అవగాహన శిబిరాన్ని నిర్వహించినట్లు ఏపీఎం మోహన్దాస్ తెలిపారు. ఈ శిబిరంలో గ్రూపు సభ్యులకు పొదుపు ఆవశ్యకత, కుటుంబ బడ్జెట్ నిర్వహణ, గ్రూప్ రుణాలు, రుణాల రెన్యూవల్స్ విధానం, బ్యాంకింగ్ సేవలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బీమా పథకాలు, డిజిటల్ బ్యాంకింగ్ వినియోగం, సైబర్ నేరాల నివారణపై వివరంగా అవగాహన కల్పించారు. తీసుకున్న రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలని, సకాలంలో వాయిదాలు చెల్లించి ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంక్ వివరాలు చెప్పవద్దని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్ఎల్ సిబ్బంది రాజాబాబు, శేఖర్, సీఆర్పీ లక్ష్మి, ఐకేపీ వీవోఏ సురేష్, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**• మందమర్రిలో సీఎం బ్రేక్ఫాస్ట్ పథకం ప్రారంభించిన మంత్రి గడ్డం వివేకానంద**





**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సీఎం బ్రేక్ఫాస్ట్ పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం మందమర్రి మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, తహశీల్దార్ సతీష్, ఎంపీడీఓ రాజేశ్వర్తో కలిసి పథకాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించి ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు చదువుపై మరింత శ్రద్ధ చూపేలా ప్రోత్సహించడమే సీఎం బ్రేక్ఫాస్ట్ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చన్నారు. విద్యార్థులు పట్టుదల, ఏకాగ్రత, క్రమశిక్షణతో చదివి తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. మందమర్రి మోడల్ స్కూల్ తెలంగాణ పబ్లిక్ స్కూల్గా ఎంపిక కావడం సంతోషకరమన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి మందమర్రిలో మోడల్ స్కూల్ ఏర్పాటు చేయించానని తెలిపారు. సోమన్పల్లిలో రూ.200 కోట్ల వ్యయంతో 2,500 మంది విద్యార్థులకు వసతి సదుపాయాలతో అత్యాధునిక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, వచ్చే ఏడాది ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా యువతకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. ప్రజాపాలనలో విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మండల కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడిగా సమీర్



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నూతన మండల అధ్యక్షుడిగా సమీర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలు స్వీకరించిన సమీర్ మాట్లాడుతూ మండలంలో మైనార్టీ వర్గాల సంక్షేమానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని, పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. సమీర్ నాయకత్వంలో మైనార్టీ విభాగం మరింత ముందుకు వెళ్తుందని నాయకులు ధీమా వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు మోహితే మారుతి, డాక్టర్ కైలాస్, వార్డ్ మెంబర్ తెలంగే రాజు, కాంగ్రెస్ స్పోక్స్ పర్సన్ ఆడే జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బతుకమ్మ సంబరాలు

**• వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి, ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో వివిధ వర్గాల ప్రజలు ఐకమత్యంతో పండుగలను జరుపుకోవడం ఇక్కడి సంస్కృతి, సాంప్రదాయాల ప్రత్యేకతకు నిదర్శనమని పేర్కొన్నారు. యువత తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల విశిష్టతను తెలుసుకుని వాటిని భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కళాశాల సిబ్బంది మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ను ఘనంగా సన్మానించారు. వేడుకల్లో అధ్యాపకులు, విద్యార్థినులు సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొని అందంగా బతుకమ్మలను అలంకరించి, బతుకమ్మ పాటలతో సందడి చేశారు.

# 2030 నాటికి టీబీ రహిత భారత్ సాధనే లక్ష్యం

**జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**





**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** టీబీ వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, జిల్లా పంచాయతీ అధికారి కిషన్, ఎన్సీసీ కమాండెంట్లతో కలిసి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030 నాటికి దేశాన్ని టీబీ రహితంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా జోష్ టీమ్లను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్డు, మండల స్థాయిలో జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్ బృందాలను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మంచిర్యాల జిల్లాలో ఇప్పటికే 15 టీబీ ముక్త్ గ్రామ పంచాయతీలను గుర్తించినట్లు తెలిపారు. టీబీ అంటువ్యాధి కావడంతో దగ్గు, తుమ్ముల ద్వారా ఇతరులకు వ్యాపించే అవకాశం ఉందన్నారు. సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. మధుమేహం, రక్తపోటు ఉన్నవారు, పొగతాగే అలవాటు ఉన్నవారు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 265 యాక్టివ్ టీబీ కేసులు ఉన్నాయని, రోగులకు వైద్య సిబ్బంది ప్రతినెలా ఇళ్లకు వెళ్లి మందులు అందించడంతో పాటు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. నిక్షయ్ పోషణ్ యోజన కింద టీబీ రోగులకు చికిత్స కాలం పూర్తయ్యే వరకు నెలకు రూ.వెయ్యి పోషణ భత్యం అందిస్తున్నట్లు చెప్పారు. నిక్షయ్ మిత్ర కార్యక్రమం ద్వారా రోగులను దత్తత తీసుకుని పోషకాహారం అందించాలని కోరారు. టీబీ రోగులను దూరం పెట్టకుండా వారికి మానసిక ధైర్యం కల్పించాలని, వైద్యుల సూచన మేరకు మందులను క్రమం తప్పకుండా వాడేలా ప్రోత్సహించాలని సూచించారు. గ్రామస్థాయిలో సర్పంచులు, పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. టీబీ నిర్మూలనపై విస్తృత ప్రచారానికి మీడియా సహకారం తీసుకోవాలని తెలిపారు. టీబీ నివారణకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1800-11-6666 ద్వారా పొందవచ్చని వివరించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది టీబీ ముక్త్ భారత్ అభియాన్ను విజయవంతం చేసి వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. టీబీ నిర్మూలనకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎన్సీసీ, మై భారత్ క్యాడెట్లు, వైద్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# కాలనీల్లో వెలుగులు జిమ్మిన వీధి దీపాలు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డు బొక్కలగూడ ప్రాంతంలో నెలకొన్న వీధి దీపాల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. వార్డు ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ కౌన్సిలర్ మునావర్ సుల్తానా ప్రత్యేక చొరవ తీసుకుని పాత, పాడైపోయిన వీధి దీపాల స్థానంలో గురువారం కొత్త లైట్లను ఏర్పాటు చేయించారు. స్థానిక నాయకులు డాక్టర్ గౌస్, రిజ్వాన్ ఆధ్వర్యంలో వీధి దీపాల ప్రక్రియను వేగంగా పూర్తి చేశారు. రాత్రింబవళ్లు శ్రమించి లైట్లను ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్ లైన్మెన్ రమేష్, ఆయన బృందాన్ని వార్డు ప్రజలు అభినందించారు. వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో రాత్రి వేళల్లో ప్రయాణించే వారి ఇబ్బందులు తొలగిపోయాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వార్డును వెలుగులతో నింపిన కౌన్సిలర్ మునావర్ సుల్తానా, డాక్టర్ గౌస్, రిజ్వాన్, లైన్మెన్, మున్సిపల్ సిబ్బందికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత సులభతరం

**• వాట్సాప్ ద్వారా నేరుగా ఫిర్యాదులు చేసుకునే అవకాశం: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో ప్రత్యేక వాట్సాప్ నంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులు, వినతులను నేరుగా వాట్సాప్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. ఇకపై ప్రభుత్వ సేవలకు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఇంటి నుంచే వాట్సాప్ ద్వారా తమ సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేయవచ్చని తెలిపారు. హైదరాబాద్లోని జిల్లా ఇన్చార్జి మంత్రి పేషీలోనూ ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని వివరించారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించడంతో పాటు, వాటి పరిష్కారంలో జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.